
'సోమశిల'కు 3,086 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 3,086 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 71.843 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.





మనుబోలు : జాతీయ రహదారిపై కమ్ముకున్న పొగ మంచు

పొగ మంచు... ప్రమాదం పెచ్చు!

రహదారులపై పొగ మంచు దుప్పటి

జిల్లాను పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 8 గంటలు దాటేవరకు మంచు తెరలు తొలగకపోవడంతో రోడ్లు కనిపించడం లేదు. పొగ మంచు కమ్ముకున్న సమయంలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితంగా గమ్యం చేరాలని నిపుణులు సూచిస్తున్నారు.

- వివరాలు 6లో..

తెగ తాగేశారు!

- మూడు రోజుల్లో రూ.22 కోట్ల మద్యం హాంఫట్
- గతేడాదితో పోల్చుకుంటే భారీగా పెరిగిన విక్రయాలు
- అయినా రాబడి పెరిగింది 4.64 శాతమే
- ధరల తగ్గుదలే కారణం



సంవత్సరం	నెల	లిక్కర్	బీర్	విలువ
2023	డిసెంబరు	1,55,823 కేసులు	31,022 కేసులు	రూ.133.39 కోట్లు
2024	డిసెంబరు	1,92,926 కేసులు	41,240 కేసులు	రూ.139.06 కోట్లు
వ్యత్యాసం		37,103 కేసులు	10.218 కేసులు	రూ.5.67 కోట్లు

నెల్లూరు (క్రైం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఎక్సైజ్ శాఖకు భారీ ఆదాయాన్నే తెచ్చిపెట్టాయి. మూడు రోజుల్లో రూ.22 కోట్ల మద్యాన్ని తాగేశారు. జిల్లావ్యాప్తంగా 182 మద్యం వైన్‌షాపులు, 52 బార్లు ఉండగా, సహజంగా రోజుకు రూ.4 కోట మద్యం విక్రయాలు సాగుతుంటాయి. అయితే, డిసెంబరు 30వ తేదీన 12.4 కోట్లు, 31న 6.4 కోట్లు, జనవరి 1వ తేదీన రూ.3.4 మద్యం విక్రయాలు జరిగాయి. అయితే తక్కువ ధరకు మద్యం విక్రయాలు జరగడంతో రాబడి మాత్రం అంతంత మాత్రంగానే వచ్చింది. 2023, డిసెంబరు నెలతో పోల్చుకుంటే 2024, డిసెంబరులో 24 శాతం లిక్కర్, 33 శాతం బీర్ కేసులు అమ్మకాలు పెరిగాయి. రాబడి విషయానికి వస్తే 4.67 శాతం మాత్రమే పెరిగింది. ఇందుకు ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వైన్ షాపులను ఏర్పాటు చేయడంతో అన్ని రకాల బ్రాండ్లు ప్రతి మద్యం దుకాణాల్లో ఉండటం, రూ.99లకే మద్యం అందుబాటులోకి రావడం, పలు రకాల బ్రాండ్లు క్వార్టర్‌పై రూ.30 వరకు తగ్గించడమే. ఏదిఏమైనా గతేడాదికంటే ఈఏడాది మద్యం విక్రయాలు పెరిగిన రాబడి మాత్రం తగ్గింది.



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం
పెంపే లక్ష్యం

సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు తదితరులు

- జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు సర్వం సిద్ధం
- 114 వినూత్న ప్రాజెక్ట్‌ల ప్రదర్శన
- నేడు ఆర్ఎస్ఆర్ఎంలో నిర్వహణ

నెల్లూరు (విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగిఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీయడం.. నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడమే లక్ష్యంగా విద్యా శాఖ జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, కేంద్రీయ విద్యాలయాల్లో పాఠశాల, మండల స్థాయిల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సదరన్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. వ్యక్తిగతం, సమూహం, ఉపాధ్యాయ విభాగాల్లో జరిగిన ఈ పోటీల నుంచి ఒక్కో ప్రాజెక్ట్‌ను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఒక్కో విభాగం నుంచి 38 చొప్పున 114 ప్రాజెక్ట్‌లు జిల్లాస్థాయి పోటీలకు హాజరవుతున్నాయి. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు రిజిస్ట్రేషన్, ఆహ్వానం, ఫుడ్, మంచినీరు, పారిశుధ్యం, ఆరోగ్యం, క్రమశిక్షణ, డాక్యుమెంటేషన్ కమిటీలను నియమించి అన్ని ఏర్పాట్లు చేపట్టారు. 150 మంది విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా తమ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించనున్నారు.

విజయవంతం చేయండి : డీఈవో

జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు గురువారం ఎగ్జిబిషన్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటూ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అందరితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలన్నారు. పోటీల్లో పాల్గొనేవారంతా ఉదయం 8 గంటలకు పాఠశాల వద్ద హాజరై తమ ఎగ్జిబిట్స్‌ను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈఓ జానకిరామయ్య, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్, ఎంఈఓలు మురళీధర్, శ్రీనివాసులరెడ్డి, అంకయ్య, ప్రధానోపాధ్యాయులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కులకు మహర్దశ

- నెల్లూరులో 24 పార్కుల అభివృద్ధికి టెండర్లు
- ఎన్‌క్యాప్ ప్రోగ్రాం కింద రూ.4 కోట్లు మంజూరు
- ఆట వస్తువులు, జిమ్ సదుపాయాలు

- వివరాలు 6లో..

ఎంత ఖర్చయినా సరే..
తప్పించుకోవాల్సిందే!

- 'పెరంకొండ' అక్రమార్కుల ప్రయత్నాలు
- విచారణాధికారులను మేనేజ్ చేసే కుట్ర



'ఎంత ఖర్చయినా సరే.. డ్రైవర్‌ను పనిలో నుంచి తీసేయండి.. ఎంత ఖర్చయినా సరే..' ఈ డైలాగ్ ఏ సినిమాలోనిదో మీకు తెలుసుకదా!. ఆ సినిమాలో హీరో తన అవసరం కోసం రూ.లక్షల విలువైన కారును బహుమతిగా ఇచ్చి డ్రైవర్ పనిలో నుంచి మానేసేలా చేస్తారు. ఇప్పుడు అదే విధంగా 'ఎంత ఖర్చయినా సరే.. మేము తప్పించుకోవాలి' అన్న రీతిలో 'పెరంకొండ' అక్రమార్కులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా విచారణాధికారులను, ఆపై అధికారులను మేనేజ్ చేసి విచారణ నుంచి బయటపడాలని దొడ్డిదారిలో కుట్రలు పన్నుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని మార్గాల్లో ప్రయత్నాలు సాగించడం, ఆ క్రమంలోనే తాజాగా ఓ ఎమ్మెల్యేను ఆశ్రయించి సాయం కోరడం చర్చనీయాంశంగా మారింది. సదరు ఎమ్మెల్యే అక్రమార్కులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమేగాక తిట్టి పంపినట్లు తెలుగుంగ ప్రాజెక్టు ఉద్యోగ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

6

రండి బాబు రండి..
కిలో రూ.10లే!

- సామాన్యుడి చెంతకు పేదవాడి ఆపిల్



పేదవాడి ఆపిల్‌గా పిలుచుకునే టమోటా ధరలు నేలను తాకుతున్నాయి. నెల రోజుల క్రితం వరకూ కిలో వందరూపాయలు పలికిన టమోటాలు ఇప్పుడు రూ.10లకు దొరుకుతున్నాయి. అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాల్లో విస్తారంగా టమోటాలను పండించారు. బద్వేల్, మదనపల్లి, నెల్లూరు మార్కెట్లలో 25 కేజీల బాక్సు ధర రూ.180 నుంచి 200 పలుకుతోంది. ధరలు పతనం కావడంతో మన జిల్లాలో సామాన్యుడికి అందుబాటులోకి వచ్చాయి. కిలో పది రూపాయలు చొప్పున వందకు పది కిలోలు విక్రయిస్తున్నారు. మండల కేంద్రమైన అనంతసాగరంలో పది రూపాయలకు విక్రయించడంతో జనం ఎగబడి కొనుగోలు చేశారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

బాగుంది... కానీ!

- పేదవారి ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు
- నిర్వహణపై మరింత పర్యవేక్షణ అవసరం



ఆత్మకూరు క్యాంటీన్‌లో నీళ్ల సాంబారు

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఫొటోలకు దండం పెడుతూ ఒకచోట, నిండిన కడుపుతో చంద్రబాబును దీవిస్తూ మరోచోట.. కూటమి ప్రభుత్వ లోగోను ముద్దాడుతూ ఇంకోచోట.. అన్నా క్యాంటీన్ల వద్ద తరచూ ఆగుపిస్తున్న దృశ్యాలివి. ఒకపూట భోజనానికే ఇంతలా సంబరపడిపోవాలా!? అని విమర్శకులు ఆశ్చర్యపోయినా క్యాంటీన్ల వద్ద పేదల కృతజ్ఞతలు చేతల రూపంలో కనిపిస్తుండటం ముమ్మాటికీ నిజం. ఉపాధి కోసమో, విద్య కోసమో, సమస్యల పరిష్కారం కోసమో జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజనల్ కేంద్రాలకు వచ్చే ఎంతోమందికి హోటల్ భోజనం అంటే చాలా ఖరీదైన విషయం. అంత డబ్బు ఖర్చు చేసే సాహసం చేయలేక ఎంతోమంది పస్తులతో ఇల్లు చేరుకునేవారు. అలాంటి వారికి అన్నా క్యాంటీన్లు కడుపు నింపే అన్నపూర్ణలా మారిపోయాయి. నెల్లూరులో ఆరు, కందుకూరు, ఆత్మకూరు, కావలి ఒక్కోచోట ఈ క్యాంటీన్లు నడుస్తున్నాయి.

కానీ..

ఇంతటి ఆదరణ పొందుతున్న ఈ పథకంలో కొన్ని సాదక బాదకాలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. గురువారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో ప్రధాన అంశాలను పాలకుల దృష్టికి తీసుకురావాల్సిన ఆవశ్యకతను తెలియజేశాయి. నెల్లూరులో ఆదరణ ఉన్నా రద్దీకి తగినంత భోజనం అందడం లేదు. భోజనం లేక చాలా మంది వెను తిరిగిపోతున్నారు. అలాగే, ఆత్మకూరులో టిఫిన్లు, భోజనాలు రుచించడం లేదు. ఇక కందుకూరు, కావలిలో రోజువారి ఇండెంట్ ప్రకారం సరఫరా చేస్తున్నారు.

నెల్లూరు (సిటీ) : నగరంలోని ముత్తుకూరు గేటు కూడలిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఉదయం టిఫిన్‌కు 400 మంది వరకు వస్తున్నారు. మధ్యాహ్నం భోజనంతో 500 మంది ఆకలి తీర్చుకుంటున్నారు. రాత్రి పూట 200 మంది వరకు భోజనం చేస్తున్నారు. అయితే, ఆకలి తీర్చుకునేందుకు జనం వస్తున్నా ఐటమ్స్ అయిపోతుండటంతో వెనుతిరుగుతున్నారు. టోకన్ల సంఖ్య పెంచాలని పలువురు కోరుతున్నారు.



నెల్లూరులో భోజనం చేస్తున్న విద్యార్థినులు



అన్నం వడ్డిస్తున్న క్యాంటీన్ సిబ్బంది

కావలిలో మంచి ఆదరణ

కావలి : అన్నా క్యాంటీన్‌కు కావలిలో మంచి ఆదరణ కనిపిస్తోంది. ఉదయం 150మందికి టిఫిన్, మధ్యాహ్నం 300 మందికి, రాత్రి 100 మందికి ఆహారం అందిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు క్యాంటీన్‌ను ప్రారంభించగా, అన్నం అయిపోయేవరకు వడ్డిస్తుంటామని నిర్వాహకులు తెలిపారు ఏరోజు కారోజు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇండెంట్ ప్రకారం ఇస్కాన్ నిర్వాహకులు అన్నం, టిఫిన్ సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం అన్నం వృథా కావటం లేదని, అయిపోయేవరకు వడ్డిస్తున్నట్లు తెలిపారు.

కందుకూరు : పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో ప్రతిరోజూ వెయ్యిమందికి పైగా నిరుపేదలు ఆకలి తీర్చుకుంటున్నారు. రెండు నెలల కిందట మధ్యాహ్న సమయంలో 600 మంది వరకు భోజనం చేసేవారని ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో గ్రామీణ ప్రజల సంఖ్య తగ్గిందని క్యాంటీన్ నిర్వాహకులు తెలిపారు. డిమాండ్‌ను బట్టి ఇక్కడ భోజనం తెప్పిస్తున్నారు. భోజనం అయిపోయిందనే మాట రాకుండా మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు కూడా భోజనం పెడుతున్నారు.

ఆత్మకూరులో ఫర్వాలేదు!

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అన్నకాంటీన్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు 450 మందికిపైగా ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం చేస్తున్నారు. కొన్నిసార్లు ప్రజలు క్యాంటీన్‌కు రావడం కొరవడితే భోజనం, కూరలు మిగిలిపోతు న్నాయి. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నా నిర్వహణ తీరుపై అన్నార్తులు కొంత అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, రుచిలేని పప్పు పెడుతున్నట్లు తెలిపారు. మెనూలో చట్నీ ఉన్నా ప్రతిరోజూ మామిడి ఊరగాయ పెడుతున్నారు. మొదట్లో గట్టి పెరుగు వేసేవారని రానురాను పలచపడిపోయిందన్నారు. ఇక ఉదయం టిఫిన్‌లో ఇడ్లీ సరిగా ఉడకదని, సాంబారు నీళ్లలా ఉంటుందని, పూరి మసాలా కూడా బాగుండదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

పైళ్లు వదిలి.. పొలంబాట!
● వరి నాట్లు వేసిన కందుకూరు సబ్‌కలెక్టర్



నిత్యం ఫైళ్లతో కుస్తీ పడుతూ బిజీగా ఉండే కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ గురువారం పొలంబాట పట్టారు. గుడ్లూరు మండలంలోని మోచర్ల గ్రామంలో వ్యవసాయ కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. అనంతరం చేవూరు, మోచర్ల గ్రామాల్లో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పైర్లలో తరచూ వచ్చే తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. అధికారులు కూడా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేదిశగా కృషి చేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ వెంట మండల వ్యవసాయ అధికారి రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- గుడ్లూరు (ఆంధ్రజ్యోతి)

● 7 నుంచి టికెట్ల విక్రయం
● సమన్వయంతో పని చేయాలి : ఆర్డీవో అనూష



వైకుంఠ ఏకాదశి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో అనూష, ఆలయ చైర్మన్, అధికారులు

వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రసిద్ధ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఎన్ అనూష తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె ఆలయంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. శాఖల వారీగా ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. రంగనాథస్వామి ఆలయం ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశికి ఆలయంలో మూడు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శీఘ్ర దర్శనం రూ.200, ప్రత్యేక దర్శనం రూ.50 టికెట్లను 7వతేదీ నుంచి విక్రయిస్తామని తెలిపారు. ఉచిత క్యూలైను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదాలు అందజేస్తామని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అనంతరం వైకుంఠ ఏకాదశి బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి, ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీపీసీఎల్ ఏర్పాటుకు కేబినెట్ అంగీకారం
● సీఎం, డిప్యూటీ సీఎంకు ఎంపీ వేమిరెడ్డి కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 2(ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీ ఎల్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటులో మరో ముందడుగు పడింది. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కేబినెట్ మీటింగ్‌లో దీనిపై సుదీర్ఘంగా చర్చించి, ఆమోద ముద్ర వేశారు. కాగా, బీపీసీఎల్ ఏర్పా టుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవ చూపారు. ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధులను, కేంద్రమంత్రులను కలిసి కంపెనీ ఏర్పాటుకు వున్న అనుకూలతలను వివరించడంలో సఫలీకృతులయ్యారు. రాష్ట్ర క్యాబినేట్ ఆమోదం తెలపడంపై ఎంపీ వేమిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో బీపీసీఎల్ ప్లాంటు ఒక మైలు రాయిగా నిలిచి పోనుందని వేమిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు ఎస్సీ వర్గీకరణ
ఏక సభ్య కమిషన్ రాక

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన వివరాలను, అభ్యంతరాలను స్వీకరించటానికి రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ శనివారం జిల్లాకు వస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కే శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ఆ కమిషన్ సమావేశం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ఎస్సీలు, వారి సంఘాల సభ్యులు అభ్యంతరాలు ఏమైనా ఉంటే రాత పూర్వకంగా సమర్పించాలని కోరారు.



శ్రావణిని అభినందిస్తున్న జిల్లా సెక్రటరీ మురళి

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు శ్రావణి


కలిగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి వనిపెంట శ్రావణి నేపాల్‌లో జరుగనున్న అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీలకు అర్హత సాధించినట్లు గురువారం హెచ్‌ఎం భీమేశ్వరరావు తెలిపారు. కలిగిరికి చెందిన విద్యార్థిని రోప్‌జంప్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గుంటూరు, నంద్యాల, కడప ఈ సందర్భంగా జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించినట్లు చెప్పారు. మధ్యప్రదేశ్, ఉజ్జయిని, మహారాష్ట్ర, షిరిడీలో జరిగిన నేషనల్ స్థాయిపోటీలో గోల్డ్‌మెడల్ సాధించి, నేపాల్‌లో జరిగే ఇంటర్‌నేషనల్ స్థాయి రోప్ జంప్ పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శ్రావణిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి నేపాల్‌లోని ఖాట్మాండ్‌లో జరిగే పోటీలకు వెళ్లేందుకు నెల్లూరు జిల్లా జంప్‌రోప్ సెక్రటరీ మురళితో పాటు పలువురు ఉపాధ్యాయులు విద్యార్థినికి సహాయ సహకారాలు అందజేశారు.

మూలస్థానేశ్వరుడి
హుండీ ఆదాయం రూ.10.17లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు జరిగింది. గతేడాది సెప్టెంబరు 13 నుంచి గురువారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.10,17,239 వచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య పర్యవేక్షకులుగా పూడిపర్తి రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో శ్రీధర్‌నాయుడు వ్యవహరించారు. స్టేట్‌బ్యాంకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయ ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పొగ మంచు...
ప్రమాదం పెచ్చు!

● రహదారులపై పొగ మంచు దుప్పటి
● ఉదయం 8 వరకు కనిపించని రోడ్లు
● డ్రైవర్లకు జాగ్రత్తలు తప్పనిసరి
● రెస్ట్ ఏరియాల్లోనే వాహనాలు నిలుపుకోవాలి
● తప్పని సరైతేనే ప్రయాణం చేయాలి



సంగం : ఉదయం 9 గంటలకు కూడా లైట్ల వెలుగుల్లో వాహనాల రాకపోకలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులు వ్యాపించి ఉన్నాయి. ముఖ్యంగా చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారి జిల్లా పొడవునా విస్తరించి ఉంది. ఈ రోడ్డు విశాలంగా ఉండటంతో వాహనాలు అతివేగంగా పరుగులు తీస్తుం టాయి. దీనికితోడు రోడ్డుపై ఎక్కువ భాగం పొగ మంచు పరుచుకుని ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. రోడ్లపై మంచు అధికంగా ఉన్నప్పుడు ఎదుటి వాహనాలు కనిపించక ఢీకొనడం వల్ల జరిగే ప్రమాదాలే 50 శాతం వరకు ఉన్నట్లు అంచనా. జాతీయ రహదారికి పక్కనే వరుసగా వాహనాలు నిలిపి ఉండటం మనం చూస్తూనే ఉంటాము. ఇలా నిలిపిన వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. హైవే అథారిటీ వారు పలుచోట్ల రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేసి ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను నిలిపి విశ్రాంతి తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

● పొగ మంచులో ప్రయాణించే వారు ముందుగా వాహనాల హెడ్‌లైట్ల పనితీరును చెక్ చేసుకోవాలి. ఒక లైటు మాత్ర మే పనిచేస్తున్నా, లైట్లు తక్కువ కాంతి తో వెలుగుతున్నా వెంటనే సరి చేయాలి. లేకపోతే ప్రయాణాన్ని మానుకోవాలి.

● దట్టమైన పొగమంచులో వెళ్లేటప్పుడు కారులోని విపత్తు హెచ్చరికల లైటును ఆన్ చేయాలి. ఇలా చేయడం ద్వారా రహదారి మీద కారు ఉనికిని ఇతర వాహనాలు గుర్తించే అవకాశం ఉంటుంది. విపత్తు హెచ్చరికల లైటు అంటే కారుకు నాలుగు వైపుల ఉన్న లైట్లు వెలుగుతూనే ఉంటాయి.

● పొగమంచులో వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల మీద దృష్టి సారిస్తూ చేతులను ఎప్పుడూ స్టీరింగ్ మీదనే ఉంచి మలుపుల్లో వెంటనే స్పందించి స్టీరింగ్‌ను తిప్పుతూ అదుపు చేసేలా ఉండాలి. ఇవన్నీ జరగాలంటే తక్కువ వేగంతో వాహనం నడపాలి.



సంగం : బ్యారేజీని కప్పేసిన మంచు

● జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ఉన్న రేడియం లైటింగ్ గుర్తులను అనుసరిస్తూ వాహనం నడపాలి. వంతెనలు, ఇరుకైన రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తెలుపు, పసుపు రంగుల్లో రోడ్డు మార్కులను గమనిస్తూ వాహనం నడపాలి.

● వాహనం ముందు, వెనుక అద్దాల మీద మంచు పేరుకున్నప్పుడు రహదారి సరిగా కనిపించదు. అయితే మంచును ఆటోమేటిక్‌గా కరిగించేందుకు కార్లలోని డీ ఫాగర్‌ను ఆన్ చేయాలి.

● మంచులో ప్రయాణం చేసే సమయంలో రోడ్డుపైనే దృష్టిని కేంద్రీకరించాలి. ఇందుకోసం వాహనాల్లోని మ్యూజిక్ సౌండ్‌ను తక్కువగా ఉంచుకో వాలి, పూర్తిగా ఆపేయడం ఉత్తమం.

● సాధారణ పరిస్థితుల్లోనే మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం. ఇక, దట్టమైన పొగమంచు కమ్ముకున్నప్పుడు మద్యం సేవించిన వారు డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం చాలా మంచిది.

● మంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మీ ముందున్న వాహనానికి తగినంత దూరాన్ని పాటించాలి. దీని వల్ల ఆ వాహనాలు పొరపాటున ప్రమాదానికి గురైతే వెంటనే మనం పక్కకు తప్పుకునే అవకాశం ఉంటుంది.



నెల్లూరు నగరం, పరిసర ప్రాంతాలను పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 8.30 గంటల వరకు కూడా మంచు దుప్పటి విడవటం లేదు. నెల్లూరు రూరల్లోని 2వ డివిజన్ పెద్దచెరుకూరు వద్ద నివాసాలపై గురువారం ఉదయం తెల్లటి మంచు పరుచుకుని చూపరులకు ఆహ్లాదానుభూతినిచ్చింది. అయితే ఈ మంచు, చలి వల్ల చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో పొద్దున్నే బయటకు వచ్చేందుకు సంకోచిస్తున్నారు.

- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)

అత్యవసరమైతేనే ప్రయాణించండి

పొగ మంచు అధికంగా ఉన్న సమయంలో అత్యవసరం అనుకుంటేనే ప్రయాణం చేయాలి. అదికూడా తక్కువ స్పీడులో వాహనం నడపాలి. పూర్తి దృష్టి డ్రైవింగ్‌పై ఉంచాలి. రోడ్డు పూర్తిగా మంచుతో కమ్మేసి ఉంటే వాహనాలను రెస్ట్ ఏరియాలో పార్క్ చేసుకోవడం మంచిది. రోడ్డు పక్కనే వాహనాలు నిలిపే వారిపై చర్యలు చేపడతాము. వేగం కన్నా ప్రాణం మిన్న అని గుర్తించాలి.

- జీ చందర్, డీటీసీ

అన్నదాతకు భరోసా
● పెట్టుబడి సాయం రూ.10వేలకు పెంపు
● హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు

నెల్లూరు (వ్యవసాయం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు అందిస్తున్న సాయాన్ని పెంచింది. వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని (పీఎం కిసాన్) రూ.6వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడంతో కర్షకుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటివరకు 18 విడతలుగా కేంద్రం సాయం అందించగా, 19వ విడత ఫిబ్రవరిలో అందించే అవకాశం ఉంది. కాగా, 2019లో ప్రారంభమైన పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద ఏడాదిలో మూడు విడతలుగా రూ.6వేలు రైతుల ఖాతాల్లో కేంద్రం జమ చేస్తోంది. అయితే ఈ సాయాన్ని రూ.12 వేలకు పెంచాలని రైతు సంఘా లు, రైతులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి. నూతన సంవత్సరం కానుకగా రూ.10వేలకు పెంచు తున్నట్లు కేంద్రం ప్రకటించింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అంది స్తున్న ఎన్టీఆర్ భరోసా మాదిరిగా కాకుండా కొన్ని షరతులతో పీఎం కిసాన్ పథకం వర్తింపజేస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో వివరాలు సరిగా లేకపోవడం, ప్రభుత్వ ఉద్యోగం, ప్రభుత్వ పింఛను, ప్రజాసాధికార సర్వేలో నమోదు కాకపోవడం వంటి పలు కారణాలతో అర్హత కలిగిన వారు సైతం తిరస్కరణకు గురవుతున్నారు.

● జిల్లాలో 1,67,240 మందికి లబ్ధి

2019లో జిల్లాలో దాదాపు 2.51లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ పథకం లబ్ధి చేకూరింది. ఆ తరువాత నిబంధనల పేరుతో లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తూ 1,67,240లకు చేరింది. కేంద్రం ప్రకటించిన రూ.10వేలు మూడు విడతల్లో అందుతుందా లేదంటే ఐదు విడతలుగా ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. రెండు విడతల్లో రూ.3వేలు చొప్పున మరో విడతలో రూ.4వేలు అందించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

పార్కులకు మహర్దశ
● నెల్లూరులో 24 పార్కుల అభివృద్ధికి టెండర్లు
● ఎన్‌క్యాప్ ప్రోగ్రాం కింద రూ.4 కోట్లు మంజూరు
● ఆట వస్తువులు, జిమ్ సదుపాయాలు

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఏ పార్కు చూసినా ఏమున్నది గర్వకారణం అన్న రీతిలో నెల్లూరు నగరంలో పార్కులు తయారయ్యాయి. వైసీపీ పాలన ఐదేళ్లలో వీటిని పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో అధ్వాన్న దుస్థితికి చేరుకున్నాయి. కొత్త పార్కులను అభివృద్ధి చేయడం అటుంచితే కనీసం ఉన్న పార్కుల్లో వసతులు కల్పించడం కూడా గగనమైంది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో పార్కుల రూపురేఖలు మారుతున్నాయి. ఇటీవలే కొన్ని పార్కుల్లో చెత్తను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగా, తాజాగా మరికొన్ని పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. నెల్లూరు నగరంలో మొత్తం 60 పార్కులు ఉండగా వాటిలో 24 పార్కులను పూర్తిగా అభివృద్ధి చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. నేషనల్ క్లీన్ అండ్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌క్యాప్) కింద నగరానికి రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వాటితో ఆ 24 పార్కులను అభివృద్ధి చేయనున్నారు. పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేసి జిమ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తొలి దశ అభివృద్ధి పనులకు ముఖ్యమైన ప్రాంతాల్లోని పార్కులనే ఎంపిక చేశారు. దీనికి సంబంధించి ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. ఒకటి, రెండు నెలల్లో పార్కుల్లో వసతులు అందుబాటులోకి రానున్నాయి. మలి దశలో మిగిలిన పార్కులను కూడా అభివృద్ధి చేసేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు.



ఆర్ఐసీయూ విభాగాన్ని ప్రారంభిస్తున్న వైద్య నిపుణులు

జీజీహెచ్‌లో
ఆర్ఐసీయూ ప్రారంభం

నెల్లూరు (వైద్యం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో గురువారం నూతన రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఆర్ఐసీయూ)ను ప్రారంభించారు. మత్తు వైద్య విభాగం హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా ఈ యూనిట్ ను ప్రారంభించారు. డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ ఈ విభాగం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని తెలియచేశారు. అనేక శస్త్ర చికిత్సలకు ఆర్ఐసీయూ కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ శాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంత ఖర్చయినా సరే..
తప్పించుకోవాల్సిందే!

● 'పెరంకొండ' అక్రమార్కుల ప్రయత్నాలు
● విచారణాధికారులను మేనేజ్ చేసే కుట్ర
● అక్రమాలు జరగలేదని చూపించే యత్నం
● ఓ ఎమ్మెల్యేను కలిసిన దళారులు
● తిట్టి పంపిన సదరు ప్రజాప్రతినిధి

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ప్రాజెక్టు కింద ముంపు ప్రాంతం కాకపోయినా ముంపు కింద చూపించి కలువాయి మండలం పెరంకొండలో సుమారు రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని పరిహారం కింద చెల్లించారని రెండేళ్ల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో అప్పటి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ సుమారు 8 నెలలపాటు సర్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులతో విచారించి అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. ముంపు పేరిట అధికంగా చెల్లించినదే సుమారు రూ.33 కోట్లు ఉన్నట్లు గుర్తించి ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అయితే ఈ కుంభకోణంలో ఐఏఎస్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు కూడా ఉండట ంతో ఆ నివేదికను తొక్కి పెట్టారు. కాగా పరిహారం చెల్లించినా ఆ గ్రామం ఖాళీ చేయకపోగా మళ్లీ ప్రజాధనంతో అభివృద్ధి పనులు చేపట్టడంపై గతంలోనే అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించిన ఓ దళారి.. ఆ తర్వాత కూడా తన అక్రమ మార్గాన్ని వదల్లేదు. ఇచ్చిన పరిహారం చాలదని, ఇంకా కావాలంటూ ఆర్‌అండ్‌ఆర్ అథారిటీలో కేసు వేశారు. అలానే ఇంకొంత మందికి పరిహారం అందలేదని, వారికి కూడా రూ.24 కోట్లు పరిహారం చెల్లించాలంటూ మరో కేసు కూడా నడుస్తోంది. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించిన కండలేరు జలాశయం కింద ఇంకా పరిహారం పేరిట కేసులు వస్తుండటం, వాటి వెనక కొందరు దళారులు పర్సంటేజీలు మాట్లాడుకొని కీలకంగా వ్యవహరిస్తున్న విషయాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. దీంతో ముంపు పేరిట విచ్చలవిడిగా జరుగుతున్న ప్రజాధనం దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. పెరంకొండ విచారణ ఫైల్‌ను బయటకు తీసి విజిలెన్స్ విభాగానికి అప్పగించింది.

● తప్పించుకునేందుకు కుట్రలు

నెల రోజుల క్రితం జిల్లా విజిలెన్స్ అధికారులకు ఆదేశాలు అందగా, ఆ వెంటనే వారు విచారణ ప్రారంభించారు. జేసీ నివేదికను, పరిహారం చెల్లింపు ఫైల్స్‌ను పరిశీలిస్తూ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఇప్పటికే పెరంకొండలో డీజీపీఎస్ సర్వే నిర్వహించారు. ఆ గ్రామం కండలేరు కాంటూర్ పరిధిలోకి (ముంపు ప్రాంతం పరిధి) వస్తుందా? రాదా? అన్నది నిర్ధారించే పనిలో ఉన్నారు. గ్రామంలో ఓ కాలనీ మాత్రమే ముంపు కిందకు వస్తుందని, కానీ అందుకు విరుద్ధంగా మొత్తం గ్రామానికి పరిహారం చెల్లించినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నట్లు సమాచారం. అదే సమయంలో అడ్వకేట్‌గా చెప్పుకుంటూ ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించిన ఓ దళారి పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు. నెల్లూరుకు 70 కి.మీ దూరంలో ఉన్న గ్రామస్థులకు అక్కడి బ్యాంకులను కాదని నెల్లూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులోనే ఎందుకు.. ఎలా.. ఖాతాలు తెరిచారు? ప్రభుత్వం నుంచి ఆ ఖాతాల్లో పరిహారం జమయ్యాక ఏఏ ఖాతాలకు డబ్బులు మళ్లించారు? అన్నది కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇలా మొత్తం తీగలాగితే ఈ దళారీతోపాటు వివిద స్థాయిల అధికారుల పాత్ర కూడా బట్టబయలవుతుంది. అందుకోసమే ఈ విచారణ ముందుకు సాగకూడదని అక్రమార్కులు తెరవెనుక తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పెరంకొండ గ్రామం ముంపు కిందకే వస్తుందని విచారణలో చెప్పించుకోవడంతోపాటు పరిహారం కూడా నిబంధనల ప్రకారమే జరిగిందని రాయించుకునేందుకు 'ఎంత ఖర్చయినా పరవాలేదు..' అన్న ఆయుధాన్ని బయటకు తీసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ క్రమంలోనే తాజాగా ఓ ఎమ్మెల్యేను అక్రమార్కులు కలవగా ఆయన వీరిపై సీరియస్ అయినట్లు సమాచారం. మరి ఈ ప్రభుత్వంలోనైనా పెరంకొండ ముంపు పేరిట జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారా.. అన్నది ఆసక్తిగా మారింది. ఒక్కసారి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటే మరొకరు ప్రజాధనం దోపిడీ చేసేందుకు భయపడతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసు పరీక్షలకు 272 మంది గైర్హాజరు

నెల్లూరు(క్రైం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో భాగంగా నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు గురువారం కొనసాగాయి. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న పరీక్షలను ఎస్పీ జీ కృష్ణకాంత్ స్వయంగా పర్యవేక్షించారు. 600 మందికి గాను 328 మంది అభ్యర్థులు మాత్రమే హాజరుకాగా 272 మంది గైర్హాజరయ్యారు.



కోదండరాముడిగా శ్రీరంగడు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో గురువారం శ్రీవారు కోదండరాముడి అలంకరణలో దర్శనమిచ్చారు. దివ్యనాలాయిర ప్రబంధ ఘోష్టి గానం, ఆళ్వారు ఘోష్టి జరిగాయి. ఉదయం ధనుర్మాస పూజలు, గోదాదేవికి తిరుప్పావై సేవాకాలం, విశేష అలంకారం జరిగాయి. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఉభయదాత అనుమాలశెట్టి నారాయణరావు, దేవస్థానం చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు. కాగా, మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో స్వామివారికి వైకుంఠనాథన్ అలంకరణ జరిగింది.



కోడూరు కాలువ కలుషితం

నెల్లూరులోని జాఫర్ సాహెబ్ కాలువ నుంచి ఏర్పడిన కోడూరు కాలువ కలుషితమవుతోంది. అల్లీపురం రైస్‌మిల్లుల నుంచి వస్తున్న వ్యర్థనీరు స్థానిక సాయిబాబా మందిరం సమీపంలో ఈ కాలువలో కలుస్తోంది. దీని వల్ల కాలువలోని సాగునీరు కలుషితమవడమేకాక దుర్వాసన వ్యాపిస్తోంది. వరిగొండ కాలువకు కూడా ఈ కలుషిత నీరే ప్రవహిస్తోంది. ఆ రెండు కాలువల కింద వందల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయా పంటలపై కలుషిత నీటి ప్రభావం పడుతోంది. అధికారులు పట్టించుకోవాలని రైతులు, గ్రామీణులు కోరుతున్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



వాడి తల నరికి తీసుకెళ్తాం!

- పెనుబల్లిలో గుర్తుతెలియని వ్యక్తుల హల్‌చల్
- కత్తులతో గ్రామస్థులపై దాడులు
- హింసకు దారితీసిన థర్టీ ఫస్ట్ వేడుకలు
- గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు



రోడ్డుపై బైఠాయించిన పెనుబల్లి దళితులు

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి2:(ఆంధ్రజ్యోతి): 'రవీంద్రగాడు ఎక్కడరా.. వాడి తల నరికి తీసుకెళ్తాం' అంటూ కత్తులతో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు పెనుబల్లి దళితవాడలో గురువారం మధ్యాహ్నం హల్‌చల్ చేశారు. పురుడు కార్యక్రమం జరుగుతున్న ఓ ఇంట్లోకి వెళుతుండగా మహిళలు అడ్డుకున్నారు. ఇంతలో కొందరు మగవాళ్లు వచ్చేలోపు రవీంద్ర అమ్మపై కర్రతో దాడి చేసి, కత్తితో బెదిరించారు. ఆ తర్వాత అక్కడకు వచ్చిన పోలీసులకు విషయాన్ని చెబుతుండగా, గుర్తుతెలియని వ్యక్తులు తమ బైక్‌లను వదిలేసి పొలాల్లోకి పరుగులు తీశారు. దళితవాడవాసులు వారిని వెంబడించి ఉలసబీడు ప్రాంతంలో ముగ్గురిని పట్టుకున్నారు. వారితోపాటు రెండు బైక్‌లను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో వేగూరు కామేశ్వరమ్మ, పసుపర్తి పెంచలరావులకు గాయాలయ్యాయి.

● వివాదానికి కారణం ఇదే!

డిసెంబరు 31 అర్ధరాత్రి పెనుబల్లి దళితవాడ వద్ద రోడ్డుపై కేక్‌లు కట్‌చేసి, మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తూ పోలీస్‌సైరన్లతో బైక్‌లపై కొందరు యువకులు చక్కర్లు కొట్టారు. దీనిపై అటుగా వెళుతున్న ఓ పోలీసు వారిని నిలదీయగా, అతనితో పాటు యువకుడిపై దాడికి దిగారు. 1న బాధిత యువకుడి బంధువులు దాడి విషయం అడిగేందుకు దళితవాడలోని నాగార్జున అనే యువకుడి ఇంటికి వెళ్లారు. అలా అడిగినందుకు ఆ యువకుడి తల్లి కామేశ్వరమ్మపై దాడి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం ఉదయం విచారిస్తామని చెప్పారు. కానీ ఉదయాన్నే నాగార్జున, అతని సోదరులు దళితవాడకు వచ్చి వేగూరు వెంకయ్యపై దాడి చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అతను పోలీసులకు ఫిర్యాదు చేసి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. కాగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు దళితవాడకు వచ్చి మారణాయుధాలతో దాడులకు దిగారు. ఈ విషయంపై ఎస్‌ఐ సంతోష్‌రెడ్డిని వివరణ కోరగా దళితవాడలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ఈ దాడి ఘటనను నిరసిస్తూ దళితులు రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేశారు.

దోభీ ఖాళీలు భర్తీ చేయాలి

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కరయ్య మాట్లాడుతూ జీవో నెంబర్ 27ను అమలు చేసి దోబీ ఖాళీలు భర్తీ చేయాలన్నారు. రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటా యించి రజకులకు 90 శాతం సబ్సిడీతో రూ.5లక్షల రుణాలు మంజూరు చేయాలన్నారు. రజక సం క్షేమ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రేకులగుంట అంకయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం గుంపర్లపాటి కామయ్య పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7401
వెండి కిలో ధర	రూ. 89,400
వెండి ఒక గ్రాము	రూ.92.40

'రెడ్‌క్రాస్'పై

చర్యలేవీ!?

వైసీపీ కార్యాలయంగా ఉందంటూ విమర్శలు

- స్వచ్ఛంద సంస్థల్లో రాజకీయాలపై ఆరోపణలు
- పాలక మండలిపై చర్యలకు రాష్ట్ర కమిటీ ఆదేశాలు
- అమలు చేయాలంటూ కలెక్టర్‌కు లేఖ



రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయం

నెల్లూరు (వైద్యం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో పని చేయాలనుకునేవారు ఎలాంటి రాజకీయ పార్టీకి చెందిన వారు కారాదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజకీయ పార్టీలలో ఉండకూడదు. నీతి, నిజాయతీ, నిబద్ధత వంటి ఏడు సూత్రాలకు కట్టుబడి పనిచేయాల్సి ఉంటుంది. ప్రత్యేకించి జిల్లాల్లో పనిచేస్తున్న రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు రాజకీయాలకు దూరంగా ఉండాలి. ఇవీ రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ గత అక్టోబరు 27న సమావేశమై చేసిన తీర్మానాలు. ఈ మేరకు ఓ లేఖను రెడ్‌క్రాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అయిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అశ్వనీ కుమార్ పరిధా అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపారు. ఆ తీర్మానాలను వెంటనే అమలు చేయాలని నెల్లూరు జిల్లాకు కూడా పంపించినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు కూడా అయిన కలెక్టర్‌కు గత నెల 27వ తేదీన రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఓ లేఖ పంపించింది. ఈ క్రమంలో జిల్లాలోని రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీపై కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది.

● వైసీపీ కార్యాలయంగా రెడ్‌క్రాస్?

నెల్లూరులో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు 2023, మార్చిలో జరిగాయి. చైర్మన్‌గా బరిలో ఉన్న పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి తన విద్యాసంస్థల్లోని విద్యార్థులతోపాటు స్నేహితులకూ రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యత్వం ఇచ్చి తనతో పాటు తన వర్గాన్ని ఎన్నికల్లో గెలిపించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు గెలిచిన 15 మంది రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులలో ఎక్కువ మంది వైసీపీ సేవలో తరలిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అంతేగాక రెడ్‌క్రాస్ నిర్వహణలోని రక్తనిధితో పాటు కేన్సర్ ఆసు పత్రి, స్పాస్టిక్ సెంటర్, గాంధీ ఆశ్రమం తది తర శాఖలలో కార్యకలాపాలకు వైసీపీకి చెందిన వారినే వినియోగిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి వైసీపీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. దీంతో రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చుకున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఆ తర్వాత వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కూడా పని చేసిన చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుత ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీ తరపున ప్రచారం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాజకీయాలు చేసే వారు స్వచ్ఛంద సంస్థ అయిన రెడ్‌క్రాస్‌లో మేనేజింగ్ కమిటీ చైర్మన్‌గా కొనసాగడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ కలెక్టర్‌కు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.



కలెక్టర్‌కు చేరుకున్న రాష్ట్ర కమిటీ లేఖ

ఆర్జేడీ కార్యాలయ సేవలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఆర్జేడీ కార్యాలయంలో ప్రభుత్వ విద్యా కార్యక్రమాల సమన్వయం, నిరంతర పర్యవేక్షణకు తాత్కాలిక పద్ధతిలో పనిచేసేం దుకు అర్హత, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎస్‌జీటీలుగా పనిచేస్తూ ఆసక్తి కలిగిన వారు అన్ని అర్హత ధ్రువపత్రాలతో ఈనెల 7వతేదీలోపల దరఖాస్తు సమర్పించాలని కోరారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచాలి

● సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య



ట్యాబ్‌లతో ఏపీసీ వెంకట సుబ్బయ్య, అధికారులు, ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డీ వెంకట సుబ్బయ్య సూచించారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం పాల్ ల్యాబ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పీఏఎల్) ల్యాబ్ ట్రైనింగ్ నిర్వహిస్తోందని చెప్పారు. జిల్లాలోని 12 కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, గణితం, తెలుగు, ఆంగ్ల ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారన్నారు. జిల్లాలో గతంలో 72 ల్యాబ్‌లు ఉండగా ప్రస్తుతం అదనంగా మరో 33 ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులు లెక్కలు, ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలను సులభంగా పజిల్స్ రూపంలో నేర్చుకునేలా ఈ పాల్ ల్యాబ్‌లోని ట్యాబ్‌లు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఒక్కో కేజీబీవీకి 30 ట్యాబ్‌ల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మురళీధర్, సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, కేజీబీవీ కోఆర్డినేటర్ మమత, పాల్ ల్యాబ్ నోడల్ ఆఫీసర్ అద్దంకి ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి పల్లె పండుగ రోడ్లు పూర్తి

● పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్

సంగం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ నిధులతో పల్లెపండుగ పేరుతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణం సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన పంచాయతీరాజ్ అధికారులతో కలిసి సంగం ఎస్సీ బాలికల వసతి గృహం, కొరిమెర్ల బాలుర వసతి గృహాలను పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మతు పనులపై సంక్షేమ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 9 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ఇటీవల ప్రభుత్వం రూ. 5 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా సంగం మండలంలో రెండు వసతి గృహాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 25 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లకు రూ. 10.22 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందులో 126 పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు సంక్రాంతి నాటికి పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న పంచాయతీ రాజ్ రోడ్లను మూడు కేటగిరీలుగా విభజించి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఈ సుబ్బరాజు, డీఈ ఏడుకొండలు, ఏఈ రామయ్య పాల్గొన్నారు.



సంగంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ ఎస్‌ఈ అశోక్ కుమార్

టిప్పర్ ఢీకొని కార్మికుడి మృతి

ముత్తుకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంట పాలెం వద్ద గురువారం రాత్రి టిప్పరు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, ముత్తుకూరు నుంచి వెంకటాచలం వెళ్తున్న బూడిద టిప్పర్ పంట పాలెం కూడలిలో రోడ్డుపై వెళ్తున్న రూపుమాజీ (22) ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. మృతుడు ఒడిస్సా రాష్ట్రం రాయగడ్ జిల్లాకు చెందిన కార్మికుడిగా గుర్తించారు. సమీప పామాయిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఎస్‌ఐ విశ్వనాథరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో మృతి చెందిన రూపుమాజీ

అనుమానాస్పదంగా వృద్ధురాలు..

సంగం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సంగం పెన్నానది పాత ఆనకట్ట ఎడమ రెగ్యులేటర్ దిగువున గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ రాజేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలి మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. కాగా, వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుందా, లేక స్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నీటిలో పడిందా అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

కస్తూరిదేవి స్కూల్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీలు 2, స్కూల్ అసిస్టెంట్ గణితం 2, బయలాజికల్ సైన్స్ 1, ఫిజికల్ సైన్స్ 1, హిందీ 1 కలిపి మొత్తం 7 ఉపాధ్యాయ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు cse.ap.gov.in ఎయిడెడ్ రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 20వతేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

చెత్త కుప్పలు.. పేడ దిబ్బలు

- చెంచులక్ష్మీపురంతోపాటు ఆరు గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- జ్వరాల బారిన గ్రామస్థులు

బిట్రగుంట, జనవరి2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెంచులక్ష్మీపురంలో పారిశుధ్యం కొరవడింది. గ్రామానికి వెళ్లే రోడ్లతో పాటు కాలనీల్లోని అంతర్గత రోడ్లను చెత్త, చెదారం, వ్యర్థప దార్థాలు వేస్తున్నారు. కొన్నిచోట్ల మేతవాములు వేయడంతో కాలనీ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో గ్రామాల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు.


సీఎల్‌పురం అంతర్గత రోడ్ల వద్ద పేడదిబ్బలు

పీడిస్తున్న విషజ్వరాలు

మేజర్ పంచాయతీలోని చెంచులక్ష్మీపురంలో నవంబరు 20వ తేదీ నుంచి నేటి వరకు విషజ్వరాలతో స్థానికులు అల్లాడిపోతున్నారు. వడ్డిపాలెం నుంచి మొదలైన జ్వరాలు ముస్లిం బజారు కాలనీల్లో 100మంది జ్వర పీడితులు ఉన్నారు.

పట్టించుకోని అధికారులు

ఈ సమస్యపై పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. డిసెంబరు 20వ తేదీ పంచా యతీ కార్యదర్శి ఈవోపీఆర్డీలతో పాటు ప్రజాప్రతినిధులు తిరిగి పరిశీలించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని వడ్డిపాలెం ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో పెద్దలు వేసిన పేడదిబ్బల తొలగింపు, ఆర్ అండ్‌బీ రోడ్డుపై పోస్తున్న చెత్తచెదారం తొలగించడం లేదని చెబుతున్నారు. అలాగే ఇబ్రహీంపేట, కొండబిట్రగుంట, ముంగమూరు, నాగులవరం, తదితర గ్రామ పంచాయతీలో ఈ పరిస్థితి ఉంది. లక్షల రూపాయలతో నిర్మించిన సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు నేడు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి వినియోగంలోకి తీసుకొస్తే గ్రామాల్లో శుభ్రత నెలకొంటుందని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సీఎల్ పురం ఆర్‌అండ్‌బీ రోడ్డుపైన ఉన్న చెత్త

సీఎల్‌పురంలో వైద్యశిబిరం

బిట్రగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో గురువారం కోవూరుపల్లి పీహెసీ వైద్యులు జిహారిక ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఇంటింటా లార్వా సర్వే నిర్వహించారు. ఇళ్ల మధ్య ఉన్న పేడది బ్బలు తొలగించాలని సంబంధి రైతులకు సూంచారు. ఇదివరకు ఉన్న జ్వరపీడుతులకు పరీక్షలు నిర్వహించి మందులతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు జిహారిక, సిబ్బంది

ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

- శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ లింగసముద్రం



ఇంటర్వ్యూ...

లింగసముద్రం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో 14 పంచాయతీల కు రూ.3కోట్ల ఉపాధిహామీ పథకం నిధులు విడుదల చేసిందని మండల పీఆర్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. నిధులతో 34సీసీ రోడ్ల నిర్మాణం చేపటడతామన్నారు.

? నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి

! మండలంలో 28 రోడ్లు పూర్తి య్యాయి. మరో 4రోడ్లు నిర్మాణ దశలో, మరో 2 రోడ్లు మార్పు చేయాల్సి ఉంది.

? పాల వెల్లువ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి :

జ. 13 సచివాలయాల పరిధిలో 13 పాలవెల్లువ కేంద్రాలు నిర్మించారు. వాటిలో కొన్ని నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి.

? ప్రస్తుతం వాటిని ఏం చేయబోతున్నారు ?

జ. ప్రభుత్వ ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటాం.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక సచివాలయం-1 వద్ద గురువారం నిర్వహించిన సదస్సులో పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం భూ రికార్డులను పరిశీలించి సమస్య పరిష్కారమయ్యే తేదీని తెలిపారు. కార్యక్రమంలలో ఆర్‌ఐ, వీఆర్వో ఉన్నారు.

● వలేటివారిపాలెం: రెవెన్యూ సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు ప్రారంబించినట్లు తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ తెలిపారు. పోలినేని చెరువులో సదస్సులో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసాద్, మండల సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

షెడ్యూలు ప్రకారం జరగని గ్రామసభలు

కొండాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్పంచులు అందుబాటులో లేకపోవడంతో మండలంలో గురువారం షెడ్యూలు ప్రకారం జరగాల్సిన గ్రామ సభలు జరుగలేదు. పంచాయతీలలో అభివృద్ధి పనులపై ఏడాదికి నాలుగుసార్లు ఈ గ్రామసభలు జరగాల్సి ఉంది. సర్పంచ్ అధ్యక్షతన సభ్యులు సమావేశమై పంచాయతీలో 3నెలల కాలంలో జరగాల్సిన పనులపై చర్చలు జరిపి తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. మండలపరిధిలో 19పంచాయతీలుండగా గురువారం 11పంచాయతీల్లో గ్రామసభలు జరిగేటట్లు అధికారులు ముందుగానే షెడ్యూలు ప్రకటించినా కేవలం గరిమెనపెంట, గొట్టిగుండాల పాలెం, తూర్పుఎర్రబల్లిలో మాత్రమే గ్రామసభలు నిర్వహించారు. మిగిలిన సర్పంచులు అందుబాటులో లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు.

డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కావలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) కావలి డివిజన్‌లోని 10మండలాల్లోని 86 చౌక దుకాణాల డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో వంశీక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు స్థానికులై ఉండి ఇంటర్ ఉత్తీర్ణత అర్హతలు కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ నెల 10 వతేదీ సాయంత్రం 5 గంటల లోపు కావలి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 19న కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

కావలి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు.. హక్కుల చట్టంపై అవగాహన పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంక్షమ్ ఆధ్వర్యంలో గురువారం పాతూరు లక్ష్మీ ఫిజియోథెరపీ ఆసుపత్రి ఆవరణలో దివ్యాంగుల చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లి మానసికంగా బలంగా తయారు కావాలన్నారు. దివ్యాంగుల చట్టంపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అంది పుచ్చుకోవాలన్నారు. దివ్యాంగులను ఎవ్వరైనా అవమానించినా చులకనగా మాట్లాడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. దివ్యాంగులు అన్యాయాలకు గురైనప్పుడు హక్కుల సాధనకు లోక్ అదాలత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత న్యాయపరమైన సహాయ సహకారాలు అందుకుని రక్షణ పొందాలన్నారు. ఈ సందర్భంగా సంక్షమ్ బాధ్యులు మాలకొండారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో సంక్షమ్ దివ్యాంగుల సంస్థ నాయకులు ఆసుపత్రి నిర్వాహకులు మాధవరెడ్డి, వేణుగోపాల్, కృష్ణారావు, నాగమణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌పూర్ ఎన్‌సీసీ శిబిరానికి 'ప్రకాశం' విద్యార్థి

కందుకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో శనివారం ప్రారంభం కానున్న ఎన్‌సీసీ డైరక్టరేట్ క్యాంప్‌నకు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిని ప్రియంవద ఎంపికైనట్లు కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 150మందిని ఎంపిక చేయగా ఇందులో 34ఏ బెటాలియన్‌లోని 9కళాశాలల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బీటీఏ కేలండర్ ఆవిష్కరణ

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీలో బీటీఏ క్యాలెండర్‌ను ఎంఈఓ-2 మల్లికార్జునరావు, శాఖవరం హైస్కూల్ హెచ్‌ఎం చెన్నయ్య చేతుల మీదుగా సంఘం సభ్యులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ సంగా మహేంద్ర, జిల్లా కౌన్సిలర్ మెండా వెంకట్రావు, నాయకులు వలేటి మాలకొండయ్య, దేపూరి శివనారాయణ, దార్ల ఆదినారాయణ, సవలం సూర్యనారాయణ, చల్లా బ్రమ్మయ్య, రమణయ్య తదితరలు పాల్గొన్నారు.

పంటలకు అధిక యూరియా వాడరాదు

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పంటలకు అధిక యూరియా వినియోగిస్తే అనర్థమే అని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ రైతులకు సూచించారు. పోలినేనిచెరువు, అంకభూపాలపురంలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొని వరి, మిర్చి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు రవీంద్ర, నాగరాజు రైతులు పాల్గొన్నారు.

బీపీసీఎల్‌కు కేబినెట్ ఆమోదంపై హర్షం

కందుకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంతో పాటు రామాయపట్నం పరిసరాల్లో 6వేల ఎకరాల భూమిని సమకూర్చాలని నిర్ణయించటంపై కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీపీసీఎల్ ఏర్పాటయితే నియోజకవర్గంలోని యువతీయువకులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు అమ్మపాలెం చల్లకొలుసు నరసింహం గురువారం ఎంఈఓ మల్లికార్జునరావు చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కమల్‌కుమార్, అశోక్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా మందా కిరణ్‌కుమార్

కావలి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ స్థానిక ఒకటో పట్టణాధ్య క్షుడిగా మందా కిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్, రిటర్నింగ్ అధికారి కమల, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్, జిల్లా ఉపాధ్యక్షురాలు మాధవి రెడ్డి, సీవీసీ సత్యం, రమణా రెడ్డి, వెంకటసుబ్బారావు పాల్గొని కిరణ్ కుమార్‌ను అభినందించారు.


ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న మందా కిరణ్‌కుమార్

రేపటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. టీడీపీ హయాంలో ఇంటర్ విద్యార్థుల కోసం 2018లో ఈ పథకాన్ని అమలు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని అటకెక్కించింది. దీంతో ఐదేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతూ చదువు పూర్తిచేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటర్ పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలను ఉచితంగా అందించింది. తాజాగా మధ్యాహ్న భోజన పథకం అమలుకు చర్యలు చేపట్టింది. ఈ పథకం పునరద్ధరణతో మేలు జరుగుతుందని అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి సామాగ్రి సమకూర్చాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న ఈపథకం హర్షించదగినది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంబిస్తారు. ఆత్మకూరు జూనియర్ కాలేజీ లో 400మంది విద్యా ర్థులకు భోజనవసతి సమకూరనుంది.

- వాణీశ్రీ, ప్రిన్సిపాల్,
ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ


ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు

ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ

వింజమూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమం ఎంఈవో మధుసూదన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలను తయారుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య, శివకోటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, పాల్గొన్నారు.

కమిటీలు కీలక భూమిక

● లింగసముద్రం: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీలు కీలక భూమిక పోషించాలని ఎంఈఓ-1 కెరవికుమార్, ఎంఈఓ-2 ఎంవి శివకుమార్‌లు తెలిపారు. గురువారం లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులకు ఇచ్చిన మండలస్థాయి శిక్షణలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మంచినీటి వసతి, విద్యార్థుల సామర్థ్యాలు గురించి సలహాలు ఇచ్చారు. ఎస్‌ఎంసీ కమిటీ సభ్యుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్లు మాధవరావు, సూర్యప్రకాశరావు, శ్రీనివాసులు, షేక్ మహ్మమద్ హఫ్సార్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

● కొండాపురం: పాఠశాల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు ఎంతో కీలకమని ఎంఈవో 1,2 కే.రవికుమార్, ఆనందరావులు తెలిపారు. మండల పరిధిలోని 66 పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, యాజ మాన్య కమిటీల చైర్మన్ల పాత్రపై గురువారం మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. కమిటీ చైర్మన్ల విధులపై రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

కమిటీలు ప్రతిరోజు పాఠశాలలను సందర్శించాలి

● ఉదయగిరి: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ల పాత్ర కీలకమైందని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీల చైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎంసీ చైర్మన్ లేదా సభ్యులు ప్రతిరోజు పాఠశాలను సందర్శించి పరిశుభ్రత, తాగునీరు తదితరంశాలను పరిశీలిస్తూ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టలన్నారు. అనంతరం ఎస్‌ఎంసీల విధులు, బాధ్యతలను ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్‌లు రామకృష్ణా రెడ్డి, పణికుమార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వింజమూరు : మాట్లాడుతున్న ఎంఈవో


లింగసముద్రం: ప్రసంగిస్తున్న ఎంఈవోలు


ఉదయగిరి: మాట్లాడుతున్న ఎంఈవో

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గంలోని 15మందికి మంజూరైన రూ.13.39 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుంటుంబసభ్యులకు అందజేశారు. ఇప్పటివరకు 250మంది దరఖాస్తు చేసుకుంటే 37మందికి చెక్కులు అందజేశామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహ్మం, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాదు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి పర్యటన వాయిదా

ఈ నెల 3న రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి నిర్వహించ తలపెట్టిన సాలిపేట, కర్లపాలెం పునరావాస కాలనీల భూమిపూజ, రామాయపట్నం పోర్టు పర్యటన వాయిదా పడినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యవసర సమావేశాలతో ఈ కార్యక్రమాలను వాయిదా వేసుకున్నట్లు సమాచారం అందినట్లు చెప్పారు. సంక్రాంతి పండుగల అనంతరం ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అన్ని గ్రామాల నుంచి తరలివచ్చిన శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాళ్లపాడు గేటు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు- నూకవరం జాతీయ రహదారిపై గురువారం రాత్రి 9గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోళ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన చొప్పర వేణు (38) దుర్మరణం చెందాడు. మృతుడు కందుకూరు ప్రయివేట్ ఆసుపత్రులో ఉన్న తమ కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి తిరిగి మోటారుబైకుపై రోళ్లపాడు వస్తుండగా కందుకూరు వెళ్తున్న పాట ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదంలో చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు వి సుధీర్, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. గురువారం మండలంలోని దేపూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ ససందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛను నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛను నగదు అందజేస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు రాజావీధిలోని సాయినాథుడికి నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానికల సుబ్బరామయ్య, కుమారుడు సురేష్ కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా అన్న సంతర్పణ చేపట్టారు. రాత్రి సాయినాథుని పల్లకీ సేవ చేపట్టారు.


సాయినాథుడికి హారతి ఇస్తున్న అర్చకులు

ఎంఈవో కార్యాలయంలో హెచ్‌ఎంలకు శిక్షణ

ఏఎస్ పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీల చైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమం ఎంఈవోలు ఎం జ్యోతి, డి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్స్‌గా ఎం హరిప్రసాద్, బి గణపతి, సిహెచ్ రాజారామిరెడ్డి వ్యవహరించారు.

●చేజర్ల: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డిసి మస్తానయ్య, డిఆర్‌పిలు సుబ్రమణ్యం, రమణయ్య యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

వెంగారెడ్డిపాళెంలో గ్రామసభ

సంగం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన గురువారం పంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు, సిమెంట్ రోడ్ల నిర్మాణం తదితర పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఉదయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వరద నీటి తొలగింపుపై తాత్కాలిక చర్యలు

కావలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సర్వాయపాలెం, ఆముదాలదిన్నె, కొనదిన్నె, రామచంద్రాపురం, జువ్విగుంటపాలెం,తాళ్లపాలెం గ్రామాల్లోని పంట పొలాల్లో నిలిచిన వరదనీటిని తొలగించేందుకు గురువారం జలవనరుల శాఖ అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. ఎక్సకవేటర్‌తో కొండేపి వరద కాలువలోని పూడికను తొలగించి వరదనీరు కిందికి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

హెచ్‌ఎంకు సత్కారం

అనంతసాగరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వసుంధరాదేవిని గురువారం ఉపాధ్యాయులు సత్కరించారు. పాఠశాలకు రాని విద్యార్థుల పట్ల హెచ్‌ఎం దృష్టి సారించి వారి ఇళ్లకు వెళ్లి బడికి వచ్చేలా ప్రోత్సాహం అందిచడంతో పాటు వారి పట్ల శ్రద్ధ చూపుతున్న సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ శాలువలతో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోజ్‌కుమార్, వెంకటరమణరాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ముగ్గురిపై కేసు

అల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిషోర్ బాబు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరు తిరునాళ్ల నిమిత్తం నిర్వహించిన పాటకచేరి వద్ద జరిగిన ఘర్షణలో పచ్చబట్ల సతీష్‌తో పాటు మరో నలుగురిపై తీవ్రంగా దాడిచేసిన కేసులో అల్లూరు గొల్ల రాము, కాకాని యశ్వంత్, గంగపట్నం జీవన్‌పాల్ అనే యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన


చిన్నారులచే కేక్ కట్ చేయిస్తున్న జయచంద్ర నాయుడు

కావలి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్ నృత్య కళా నిలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని నాట్య గురువు లిఖిత ఆధ్వర్యంలో గురువారం చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. ముందుగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పారిశ్రామికవేత్త జయ చంద్రానాయుడు చిన్నారులతో కేక్ కట్ చేసి వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వార్డు టీడీపీ నాయకులు శానం హరి, ఎమ్‌వీఎస్ ప్రసాదరావు, రఘుకుమార్ రెడ్డి, జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా సుచేతానగర్ పరిసరాలు

కావలి రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దపవని రోడ్డులోని సుచేతానగర్ పరిసర ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నగర్‌కు చుట్టూ అటవీ ప్రాంతం కావటంతో మందుబాబులు మద్యంతో ఇక్కడికి వచ్చి ఉదయం మొదలు రాత్రి వరకు మద్యం సేవిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యతో స్థానిక గిరిజన మహిళలు పశువులు, జీవాలు మేపు కుంటూ.. కూలిపనులు చేసుకునే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు ఇళ్ల నుండి బయటకు రావటానికి జంకుతున్నారు. ఈ పరిసర ప్రాంతాలల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూశాం

అల్లూరు, జనవరి 2 (ఆంధ్రజోతి): ముగ్గరమ్మల తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకున్న ఆలయ కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆయన స్థానిక నివాసంలో గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. అమ్మవార్ల గ్రామోత్సవానికి తరలిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికార యంత్రాంగం అన్ని విధాలా చర్యలు తీసుకుందన్నారు. అదేవిధంగా విద్యుత్ దీపాలంకరణ, పూలాలంకరణ చేపట్టిన కార్మికులకు ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, గోవిందరెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, హరికృష్ణారెడ్డి, సురేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూపు

● దయనీయ స్థితిలో ఆవాసాలు ● గిరిజనులను వెంటాడుతున్న సమస్యలు ● అందని పింఛన్లు, రేషన్ కార్డులు



దామరమడుగు మఠం కాలనీ సమీపంలో గిరిజనులు కాపురం ఉంటున్న గుడిసెలు

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దామరమడుగు పంచాయతీ మఠంకాలనీ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో పదేళ్లుగా పూరిగుడిసెలు వేసుకుని, సుమారు 30 కుటుంబాల గిరిజనులు జీవిస్తున్నారు. వీరికి అన్నీ సమస్యలే. కూలికి పోతేనే కుటుంబ పోషణ.. లేకుంటే పస్తులే...ఆ కుటుంబాల్లో కొంతమంది చిన్నారులు కనీసం దుస్తులు కూడా లేకుండా తిరుగుతున్నారంటే వారి పరిస్థితి అర్థం అవుతుంది. నేటికీ కొన్ని కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవు. అర్హత ఉన్నా పింఛన్లు రావడం లేదు. కొంతమందికి ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇచ్చినా ప్రయోజనమూ లేదు. గత ప్రభుత్వం జగనన్న లేఔట్లో 5, 6 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తే పలువురికి ఆ స్థలాలు అసలు ఎక్కడున్నాయో కూడా తెలియదు. మూడు కుటుంబాలకు వారికి మాత్రం కాంట్రాక్టర్ బేసుమట్టాల స్థాయిలో బెల్టు మాత్రమే పోసి రెండు బిల్లులు పెట్టుకుని నిర్మాణాలను గాలికొదిలేశారు. వారు కాపురాలున్న ఉన్నచోటనే అధికారులు ఇళ్లు మంజూరు చేసే అవకాశం ఉన్నా నేటికీ ఒక్క అధికారి కూడా ప్రభుత్వానికి సిఫార్సు చేసిన పాపాన పోలేదు.

● ఎమ్మెల్యే న్యాయం చేయాలి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దామరమడుగు జగనన్న లేఔట్‌ని పరిశీలించి న్యాయం చేయాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు. లబ్ధిదారుల నుంచి రూ. లక్షలు వసూలు చేసుకుని ఇళ్లు కట్టకుండా గాలికొదిలేశారు.అయినా అధికారులు పట్టించుకోలేదు.

ఎన్నిసార్లు అర్జీ ఇచ్చినా ఇల్లు, స్థలం ఏదీ లేదు..



గత ప్రభుత్వంలో ఇంటి స్థలం, ఇల్లు కోసం ఎన్నేసార్లు అర్జీ పెట్టుకున్నాం. ఏదీ రాలేదు. ఏడు ఏళ్లుగా ఇక్కడే గుడిసెలు వేసుకుని ఉన్నాం. జగనన్న లేఔట్లో ఇంటి స్థలం ఇస్తామని చెప్పారు. అది ఇస్తే ఇక్కడి నుంచి ఖాళీ చేయాలన్నారు. కానీ వర్షాలకు నానా తంటాలు పడుతున్నాం.

-పొన్నూరు మల్లేశ్వరి

బేసుమట్టాలు కూడా కట్టలేదు..



దామరమడుగులోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం, ఇల్లు ఇచ్చారు. బేసు మట్టాలు కూడా కట్టకుండానే బిల్లుద్వారా వచ్చిన డబ్బులు రూ. 55 వేలు కాంట్రాక్టరు తీసుకున్నారు. నేటికీ నిర్మాణాలు చేపట్టలేదు. మేము మాత్రం గుడిసెల్లోనే ఉంటున్నాం.

-బాణాల మణెమ్మ

రూ. 70వేలు కాంట్రాక్టరే తీసుకున్నాడు.



రెండు బిల్లులకు రూ.70 వేలు బ్యాంకులో పడితే కాంట్రాక్టర్ అహ్మద్‌బాషా తీసుకున్నారు. బేసుమట్టాలు నిర్మిస్తామని చెప్పి బెల్టుమాత్రం పోశారు. ఇల్లు కట్టింది లేదు. ఇక సొంతింటిపై ఆశలు వదులుకున్నాం.

-చలంచర్ల కామేశ్వరమ్మ

వ్యవసాయానికి 'ఉపాధి'నివ్వాలి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం జిల్లాలో తగిన ఫలితాలు ఇవ్వడం లేదని, రైతుల వద్ద ఉపాధి హామీ కార్మికులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు గురువారం డీఆర్వో ఉదయభాస్కర్ రావుకు వినతిపత్రం అందచేశారు. ఉపాధి హామీ పథకం సత్ఫలితాలు ఇచ్చే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్‌గా సుమలతారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్ హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్‌గా సుమలతారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తి కావలికి బదిలీపై వెళ్లారు. సుమలతారెడ్డి సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ ఇటీవల కావలికి బదిలీ అయ్యారు. అయితే పరస్పర అవగాహన బదిలీపై వారిద్దరు అటు.. ఇటు మారారు.

పట్టుబడిన కోళ్ల వ్యర్థాల వాహనం

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలో గురువారం చేపల గుంతలకు కోళ్ల వ్యర్థాలను తీసుకువచ్చిన ఓ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ వ్యర్థాలను నిర్వీర్యం చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ వెంకయ్య తెలిపారు.

మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైఎస్ఆర్ నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో నెల్లూరు-1 ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. వైఎస్ఆర్ నగర్ రామాలయం వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేశారు.

పోలీసులకు యూనిఫాం పంపిణీ

మనుబోలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని 30మంది పోలీసులకు గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. టీడీపీ యువ నాయకులు నంబూరు సుమన్‌నాయుడు, తమ్మా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమదుస్తులను ఎస్ఐ. శివరాకేష్ పోలీసులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లారెడ్డి రవీంద్రరెడ్డి, బోనుబోయిన మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

సైదాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం ఎంఈవో దయాకర్ చేతుల మీదుగా పూలే టీచర్ ఫెడరేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మడి వెంకటరత్నం మాట్లాడుతూ పూలే ఆశయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో పీటీఎఫ్ నాయకులు అన్నం శ్రీనివాసులు, తుమ్మ రవి, నాపా వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

● సైదాపురంలో ఇంజనీర్స్ డైరీ..

సైదాపురం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ చేతుల మీదుగా అసోషియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ డైరీ-2025ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో మురళీ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముని మనోజ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చేవూరు ● ఇందిరా భవన్‌లో మాజీ ప్రధానికి ఘన నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవకుమార్‌రెడ్డి, వెంకట్రావు, ఇతర నేతలు

నెల్లూరు (వైద్యం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఇందిరా భవన్‌లో సంతాప సభ నిర్వహించారు. పార్టీ నేతలు మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. చేవూరు మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతికి మన్మోహన్ సింగ్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఉపాధి హామీ పథకం మొదలు పారిశ్రామిక సెజ్‌లు, ఆర్టీఐ, పెన్షన్ పాలసీ, ఆధార్, అందరికి విద్య వంటి ఎన్నో పాలసీలు తీసుకువచ్చిన మహనీయుడు మన్మోహన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్, నాయకులు సురేష్‌బాబు, శ్రీనివాసులు రెడ్డి, ఫయాజ్, బాలసుధాకర్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు ఉత్తమ సేవలందించేందుకు కృషి



ప్రమాణం చేసిన సభ్యులు

నెల్లూరు(విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణ కోసం వాకర్స్‌కు మరింత ఉత్తమ సేవలందించేందుకు కృషి చేస్తానని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి తెలిపారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో గురువారం ఆ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి నూతన కమిటీతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ పీ శ్రీనివాసులు రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, మాజీ గవర్నర్ రామచంద్రశెట్టి, మాజీ అధ్యక్షకార్యదర్శులు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, కిలారి తిరుపతి నాయుడు, బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో సౌకర్యాలు కల్పించండి



టిడ్కో గృహాల వద్ద మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ, పక్కన జనసేన నాయకులు మల్లికార్జున యాదవ్, కిషోర్

నెల్లూరు(సిటీ/స్టోన్‌హౌస్‌పేట), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని టిడ్కో ఇళ్లలో సత్వరమే చేరే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, తాగునీటి సరఫరాను పెంచాలని అధికారులను కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. అల్లీపురంలోని టిడ్కో గృహాల సముదాయాన్ని ఆయన గురువారం జనసేన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడి సమస్యలను నాయకులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో చేరేవారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటి కంటే ఎక్కువ సామర్థ్యం అవసరమని తెలిపారు. దీంతోపాటు హైమాక్స్ విద్యుత్ దీపాలు, సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని యంత్రాంగానికి సూచించారు. ఇళ్లలో చేరిన వారిని స్థానిక సచివాలయాలకు అనుసంధానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేకలవారితోట, నేతాజీ నగర్ సచివాలయాలను కమిషనర్ సందర్శించారు. టిడ్కో గృహ లబ్ధిదారులను గుర్తించి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. 12/1 సచివాలయంలోని శానిటేషన్ కార్యదర్శి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున షోకాజు నోటీసులు జారీ చేశారు. కాగా. ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య భగత్‌సింగ్ కాలనీ వద్దనున్న టిడ్కో కాంప్లెక్స్‌లో పారిశుధ్య పనులు జరిపించారు.

మురుగు సమస్య పరిష్కరించాలి

● నారాయణరెడ్డిపేటలో స్థానికుల ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న స్థానికులు

నెల్లూరు రూరల్, జనవరి 2,(ఆంధ్రజ్యోతి) : కాలువల్లో మురుగు రోడ్లపైకి చేరుతోందని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని నారాయణరెడ్డిపేటలో స్థానికులు గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పార్టీ నాయకుడు షాన్‌వాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా చేనేత కార్మికులు జీవిస్తున్నారని, రోడ్లపై మురుగు వల్ల వారు తమ వృత్తిపరమైన పనులు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సౌత్‌మోపూరులో క్యాలెండర్ ఆవిష్కరణ

మండలంలోని సౌత్‌మోపూరులో సీపీఐ అనుబంధ చేనేత కార్మిక సంఘం రూపొందించిన 2025 క్యాలెండర్ ఆవిష్కరణ గురువారం జరిగింది. చేనేతల సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలకు రూపకల్పన చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేత పముజుల దశరథరామయ్య, చేనేత సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పముజుల హరి, నాయకులు జక్కల సుబ్బయ్య, చల్లా నరసయ్య, చైతన్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలిచేటి ప్రభాకర్‌రెడ్డి

పొదలకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త పంథాలో ఆర్థిక మోసగాళ్లు మాయ చేస్తున్నారని, ఈ విషయంలో అంతా అప్రమత్తంగా ఉండాలని వెలుగు ఏపీఎం చిన్నయ్య, టీడీపీ సీనియర్ నేత కలిచేటి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మరుపూరులో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, గుర్తింపు పొందిన సంస్థల్లో మాత్రమే అప్పులు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పోస్టర్లు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రీస్ గౌరవాధ్యక్షుడు షేక్.నౌరాజ్, కార్యదర్శి షేక్ అహ్మద్, రిసోర్స్ పర్సన్స్ ఏ.చంద్రశేఖర్, వీవోఏ లక్ష్మి, బ్యాంకు ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు శిక్షణ

వెంకటాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండలస్థాయి శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు 'పాఠశాల యాజమాన్య కమిటీ విధులు-బాధ్యతలు' అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలు మధుసూదన్, శ్రీనివాసరెడ్డి శిక్షణను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

● సైదాపురం, (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు దయాకర్, సుప్రియ, ఆర్పీలు వీరరాఘవులు, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి



మంత్రి ఫరూక్‌ని కలసిన బెజవాడ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా అవకాశం కల్పించాలని మండలంలోని ఊటుకూరుకి చెందిన బెజవాడ వంశీకృష్ణారెడ్డి, రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్ఎండీ. ఫరూక్‌ని కోరారు. అమరావతిలోని సచివాలయంలో గురువారం మంత్రిని కలిసి విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అనుమతి మేరకు మంత్రిని కలిశానన్నారు. ఏఎంసీ చైర్మన్‌గా తనను నియమిస్తే నియోజకవర్గంలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

100 టన్నుల యూరియా పంపిణీ

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): ఒక్కరోజులోనే మండలంలోని రైతులకు 110టన్నుల యూరియాను అందజేశామని మండల వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి యూరియా కోసం ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో సొసైటీకి 90టన్నులు, జట్లకొండూరు, కాగితాలపూరు, కొలనుకుదురు, లక్ష్మీనరసాపురం గ్రామాలకు 20టన్నుల యూరియాను వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. గురువారం వ్యవసాయాధికారి దగ్గరుండి రైతులకు ఎమ్మార్పీకే యూరియా అందించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో కళారాణి, సీఈవో చెంచుఓబులు పాల్గొన్నారు.

5న అజీజ్‌కు ఆత్మీయ సన్మానం : కోటంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆత్మీయ సన్మాన సభ ఈనెల 5న జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సభను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. గురువారం ఆయన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అజీజ్ ఆత్మీయ సన్మాన సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బెజవాడ గోపాల్‌రెడ్డి విగ్రహం నుంచి ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు జలదంకి సుధాకర్, జెన్ని రమణయ్య, గున్నయ్య, రఘు, సాబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా కాలువ కల్వర్టు



కోవూరు మండల పరిధిలోని పాటూరు- దామరమడుగు రహదారిలో కోవూరు కాలువపై బ్రిటీష్‌వారి హయాంలో నిర్మించిన కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. గత ఐదేళ్లుగా దీన్ని గురించి పట్టించుకోక పోవడంతో దెబ్బతింది. ఇరిగేషన్ శాఖాధికారులు మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టు కూలితే పొలాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కూటమి ప్రభుత్వమైనా దీనిపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

క్విజ్ పోటీల్లో పెంచల కిషోర్‌కి ద్వితీయ స్థానం



పెంచలకిషోర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గత నెల 30న విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ కాలేజీలో రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ -2024 క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 26 జిల్లాల నుంచి 312 మంది పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని అమ్మవారిపాలెం ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదివే విద్యార్థి నాగినేని పెంచలకిషోర్ ద్వితీయ స్థానం సాధించాడు. ఈ విద్యార్థికి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ.12వేల నగదు అందజేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పెంచలకిషోర్‌ను పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం. ఆర్.శ్రీహరిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కౌశల్ కో ఆర్డినేటర్ జీ సురేంద్రకుమార్, ఉపాధ్యాయులు ఏ.విజయభాస్కర్, ఎల్.వెంకట్‌రెడ్డి, వీ.నాగశంకర్, జీ రామరాఘవయ్య, ఎస్‌కె.ఖాజారంతుల్లా, పీ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



పుష్పాంజలి కుటుంబానికి నగదును అందజేస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన డీఆర్‌డబ్ల్యూ కళాశాల అధ్యాపకురాలు పుష్పాంజలికి వీఎస్‌యూ తరుపున రూ.55 వేల సాయాన్ని అందించారు. ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షల మూల్యాంకానికి పుష్పాంజలి హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.ప్రస్తుతం ఆమె నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం వీసీ ఆసుపత్రికి చేరుకొని ఆమెను పరామర్శించారు. యూనివర్సిటీ పరీక్ష విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగం, వలంటీర్లు, అధ్యాపకుల నుంచి సేకరించిన రూ.55 వేలు నగదును వీసీ ఆమె కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు

కాలనీకి దారి సౌకర్యం కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న జగనన్న కాలనీ వాసులు

మనుబోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తాము నివాసముంటున్న కాలనీకి రాకపోకలు సాగించాలంటే ఒకే ఒక్క దారి ఉందని, అది కూడా అధ్వానంగా ఉందంటూ మనుబోలు జగనన్న కాలనీవాసులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాలనీకి నాలుగుదారులు ఉండేవన్నారు. ఇటీవల ప్రైవేట్ స్థలాల వారు దారులన్నింటిని మూసివేశారన్నారు. ప్రస్తుతం ఉన్న ఒక్క దారి కూడా గోతులుపడి, నడిచేందుకు వీలుగా లేదన్నారు. వీధిదీపాలు లేవన్నారు. రాత్రిళ్లు ఈ దారిలో ప్రయాణించాలంటే భయమేస్తోందన్నారు. కాలనీలో తాగునీటి వసతి కూడా లేదన్నారు. ఈ సమస్యలపై ఎంపీడీవో జలజాక్షిని కలిసి వారు విన్నవించారు. రెండు రోజుల్లో తహసీల్దార్, తాను కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీవో తెలిపారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధురాలికి దుప్పటి అందచేస్తున్న సోమిరెడ్డి మనువడు, మనువరాలు

నెల్లూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మనుమడు రణదేవ్‌రెడ్డి, మనుమరాలు అమైరా గురువారం అల్లీపురంలోని గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో సోమిరెడ్డి పిలుపు మేరకు నాయకులు దుప్పట్లు, నోట్ పుస్తకాలను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. వాటన్నిటినీ సేకరించిన ఆయన వారసులు గిరిజన పేదలకు దుప్పట్లు, పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు అందచేశారు.

అధిక యూరియా వాడకం అనర్థం

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి2(ఆంధ్రజ్యోతి): వరిపైరుకు అధిక మోతాదులో యూరియా వాడకం అనర్థమని మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పంచేడు, మినగల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ యూరియా వాడకంవల్ల మొక్కల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. క్రిమిసంహారక మందులు వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు, సర్పంచి సూరా విజయలక్ష్మి, బొర్రరాము, రైతులు పాల్గొన్నారు.

పెంచలకోనలో శ్రీరంగం పీఠాధిపతి



స్వామివారి చిత్రపటాలను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

రాపూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీరంగం పీఠాధిపతి ఆచార్య పరమకొటై చిన్న అనువన్ స్వామి గురువారం పెంచలకోనకి విచ్చేసి నరసింహస్వామి, చెంచులక్ష్మీ, ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాలను అందజేసినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

జీవన్ ప్రమాణ్ కేంద్రం ఏర్పాటు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో గురువారం జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్ల కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సహాయ ట్రెజరీ అధికారి ఎస్‌కే అహ్మద్ ప్రారంభించారు. అధిక సంఖ్యలో పెన్షనర్స్ పాల్గొని లైఫ్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి, ఎన్ శ్రీనాథ్, వీ వీరేంద్రనాథ్, డీ గోపాల్, ఖాజా రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీఆర్ స్కూల్లో కవితల పోటీ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్, రచయితలు

నెల్లూరు(విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఉన్న ఎస్‌వీఆర్ పాఠశాలలో నెల్లూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం కవితలు, ముగ్గుల పోటీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని విభాగాల్లో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో నెరసం అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి డాక్టర్ పీ అన్నపూర్ణమ్మ, కోశాధికారి నజ్మాబేగం, ఉపాధ్యక్షురాలు అరుణ, సభ్యురాలు భారతి, ఉపాధ్యాయుడు అంకబాబు తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం టేబుల్ క్యాలెండర్‌ను వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయంలో డీఏవో సత్యవాణి గురువారం ఆవిష్కరించారు. ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం సంతరాజు, జహీర్‌అహ్మద్, ఏడీఏ నర్సోజి, చరణ్, మహబూబ్ బాషా, నాగరాజు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 3 జనవరి 2025



పందేనికి సై

● కోళ్ల రకం, రంగును బట్టి రూ.2 లక్షల వరకు పలుకుతున్న ధర

6లో

కాళ్లకు కత్తికట్టి.. బరిలోకి దింపేందుకు పలుచోట్ల పందెంకోళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వీటికి శిక్షణ ఇప్పించి, జిల్లాకు తీసుకొచ్చారు. వీటి జాతి రకం.. రంగు.. డిమాండును బట్టి రూ.రెండు లక్షల వరకు కొన్నారు. చాటుమాటుగా తీసుకొచ్చిన ఈ కోళ్లకు పౌష్టికాహారం అందించి. బలంగా తీర్చిదిద్దుతున్నారు.

మద్యం తాగి.. వాహనాలు నడిపి

● తిరుమలలో ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్

- 6లో -

ఆరోగ్యమే ఆనందం

ఈ కొత్త సంవత్సరంలో జీవితం ఆనందమయంగా ఉండాలంటే ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. మన గురించి.. మనం కాసింత శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడే 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అవుతుంది. దీనికి ఏం చేయాలనేది 6లో తెలుసుకుందాం.



ఈఎస్ఐ ఆస్పత్రికి 100 పడకల హోదా

● రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం

తిరుపతి(వైద్యం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా హోదా పెంచుతూ రాష్ట్ర కేబినెట్‌లో గురువారం ఆమోదం తెలిపారు. ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చి కార్మికులకు వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో 2018లో కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మించారు. అన్ని వసతులతో ఈఎస్ఐ ఆస్పత్రి రూపుదిద్దుకుంది. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 100 పడకల ఆస్పత్రి కలగానే మిగిలిపోయింది. దీంతో ఆస్పత్రిలో వైద్య సదుపాయాలున్నా 100 పడకల హోదాకు నోచుకోక సిబ్బంది, మందుల కొరతతో కార్మికులకు అరకొర వైద్యం అందుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన రాష్ట్ర కేబినేట్ సమావేశంలో ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచుతూ ఆమోదం తెలపడంతో రాయలసీమలోని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈఎస్ఐ ఆస్పత్రికి 100 పడకల హోదా పెరగడంతో ఆస్పత్రిలో సిబ్బంది, మందుల సంఖ్య పెరిగి మరింత స్థాయిలో కార్మికులకు వైద్య సేవలు అందున్నాయి. ఆస్పత్రికి 100 పడకల హోదా కల్పించేందుకు ఎంతగానో కృషి చేసిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌కు, రాష్ట్ర డైరెక్టర్ ఆంజినేయులకు ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్యాంబాబు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

యాజమాన్య నిర్లక్ష్యమే కారణమా?

● స్టీల్ ఫ్యాక్టరీ అగ్ని ప్రమాదంలో ఒకరి మృతి

● చికిత్స పొందుతున్న మరో ఐదుగురు ● ఘటనపై ఆరా తీసిన మంత్రి సుభాష్

పెళ్లకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య నిర్లక్ష్యమే స్టీల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదానికి కారణమన్న విమర్శలు తలెత్తుతున్నాయి. అక్కడి పరిణామాలను పరిశీలించాక పలువురు ఇదే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం అర్థరాత్రి సమయంలో ఫర్నేస్ బాయిలర్ ఒత్తిడికి గురై పేలడంతో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ అగ్ని ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. వీరిని నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో గురువారం చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సిపాయిలాల్ (30) మృతిచెందారు. మిగతా ఐదుగురు చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే. కాగా, ఫర్నేస్ బాయిలర్‌లో సామర్థ్యానికి మించి ఒత్తిడి తెచ్చినట్లుగా చెబుతున్నారు. దాంతో పాటు బాయిలర్ ఫర్నేస్ కాయిల్‌లో నుంచి ఆయిల్ లీకవుతున్నా పట్టించుకోలేదని తెలిసింది. ఇలా నిర్లక్ష్యంగా ఉండటం వల్లే మంటలు చెలరేగి బాయిలర్ పేలిపోవడానికి కారణమైందని సమాచారం. ఈ ప్రమాద సమయంలో 12 మంది వరకు అక్కడ విధుల్లో ఉన్నట్లు తెలిసింది. ప్రమాదంపై అధికారులు పూర్తి సమాచారం రాబట్టేందుకు ఇక్కడి సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు.

ప్రమాదాన్ని చిన్నదిగా చూపే యత్నం!

గతంలోనూ ఇక్కడ పలు ప్రమాదాలు జరిగినా బయటకు పొక్కనివ్వలేదని స్థానికులు అంటున్నారు. కార్మికులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో బయట పడలేదు. బుధవారం అర్థరాత్రి సమయంలో ప్రమాదం జరిగినా అది చాలా చిన్న ప్రమాదమే అన్నట్లుగా చిత్రించేందుకు యాజమాన్యం ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. సహాయక చర్యల్లో పాలు పంచుకునేందుకు చుట్టుపక్కల స్థానికులు ముందుకొచ్చినా లోపలకు అనుమతించకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. భద్రతా చర్యల్లోనూ నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలున్నాయి.

ఇలాంటి ఘటనలు పునరావృతం కానివ్వద్దు

● నిర్లక్ష్యం వహిస్తే యాజమాన్యంపై కఠిన చర్యలు

● ఎమ్మెల్యే విజయశ్రీ హెచ్చరిక

ఇలాంటి ప్రమాదకర ఘటనలు మళ్లీ జరగకుండా యాజమాన్యం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్పష్టంచేశారు. పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీని గురువారం ఉదయం ఆర్డీవో కిరణ్మయితో కలసి ఆమె సందర్శించారు. పేలిన బాయిలర్ ప్రాంతాన్ని పరిశీలించారు.



సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

దానికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను చూశారు. అనంతరం యాజమాన్యంతో సమావేశమై బాయిలర్ పేలుడుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాటు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, పార్థసారధి పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, వీఆర్వోలు రమేష్, సుమతి తదితరులున్నారు.

క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించండి

● కలెక్టర్‌కు మంత్రి వాసంశెట్టి ఆదేశం

'స్టీల్ ఫ్యాక్టరీలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోండి. వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమగ్ర నివేదిక ఇవ్వండి' అని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను రాష్ట్ర కార్మికమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అండగా నిలవాలన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం

మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారాన్ని యాజమాన్యం అందిస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. చికిత్స పొందుతున్న ఐదుగురు కార్మికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారంతో పాటు వైద్యఖర్చులను యాజమాన్యం భరించేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

వేరుశనగ రైతుల 'పుట్టి' ముంచుతున్న దళారులు

● సిండికేట్ కావడంతో పడిపోయిన ధరలు

● ఐదు రోజుల ముందు వరకు పుట్టి వేరుశనగ (11.5 బస్తాలు) కాయల ధర రూ.35 వేల నుంచి రూ.40 వేలు.

● ఆ తర్వాత ధరలు రూ.29.5 వేలకు పడిపోయాయి.

ఇలా ధరలు తగ్గిపోవడానికి.. ఈ ఐదు రోజుల్లో జరిగిన పరిణామాలేంటంటే.. రైతులు వేరుశనగను ఒబ్బిడి చేయడమే. అంటే కాయలు కల్లానికి చేరేటప్పటికి ధరలు తగ్గిపోయాయి. దళారులు సిండికేట్ అయి.. ఇలా తమ 'పుట్టి' ముంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సముద్రతీర గ్రామాల్లోని సిలికా భూముల్లో అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో తీరప్రాంత రైతులు వేరుశనగలో కొత్తరకమైన ట్యాగ్24 (గుజరాత్ సీడ్) సాగులో పెట్టారు. వరుస నష్టాలతో దెబ్బతింటూ వచ్చిన రైతులు.. ఈ రకంతోనైనా అధిక దిగుబడి సాధించి అప్పుల నుంచి బయటపడొచ్చని భావించారు. ఇలా.. కోట మండలం కర్లపూడి, సిద్ధవరం, వావిళ్లదొరువు, గోవిందపల్లి, కొత్తపట్నం, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం, గున్నంపడియా.. చిల్లకూరు మండలంలోని కనుపూరు, బల్లవోలు, మన్నేగుంట తదితర తీర గ్రామాల్లోని రైతులు సిలికా భూముల్లో ట్యాగ్24 రకం వేరుశనగ సాగు చేశారు. మూడు నెలల కాలవ్యవధిలో చేతికి వచ్చే ఈ పంటపై రైతులు ఆశలు పెట్టారు. ఎకరా రెండు నుంచి 4 పుట్లు వరకు దిగుబడి రావాల్సి ఉంది. ఎకరాకు రూ.40వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. కానీ, పంట సరిగా రాలేదు. అయితే, మొదట్లో ఈ రకం కాయలు పుట్టి రూ.35వేల నుంచి రూ.40వేల వరకు ధర పలికింది. దీంతో రైతులు దిగుబడి తగ్గినా రేటు కలిసొస్తుందని భావించారు. ఐదు రోజులుగా వేరుశనగ పెరికి.. కాయలు ఆరబెట్టారు. అదే సమయంలో ధర కూడా పుట్టి 29,500 రూపాయలకు పడిపోయింది. తగ్గిన దిగుబడి.. ధరలతో దిగాలుపడ్డ సముద్ర తీర ప్రాంత రైతులు చేసేదిలేక దళారులు అడిగిన ధరలకు అమ్ముకుంటున్నారు.



శ్రీనివాసాపురంలో ఆరబెట్టిన వేరుశనగ కాయలు

- కోట, ఆంధ్రజ్యోతి

'సదరం' సర్టిఫికెట్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

● అధికార యంత్రాంగానికి కలెక్టర్ హెచ్చరిక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయనే నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి రీవెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌తో పాటు పలు అంశాలపై విజయవాడ నుంచి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. సదరం ద్వారా జారీ సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించడానికి ప్రత్యేకంగా వైద్యాధికారులను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. నకిలీ ధృవీకరణ పత్రాలు, టాంపరింగ్ వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లపై పింఛన్లు పొందుతున్న వారిలో మొదటి దశలో మంచానికే పరిమితమైన వారి ఇళ్లను ప్రత్యేక వైద్యులు, డిజిటల్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ బృందం సందర్శించి వివరాలు నమోదు చేస్తారన్నారు. సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ చాలా పకడ్బందీగా చేపట్టాల్సి ఉటుందని ఎలాంటి అక్రమాలకు చోటు ఉండరాదని తెలిపారు. కొత్తగా బోగస్ సదరం సర్టిఫికెట్లు ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు పీడీ శోభన్‌బాబు, అధికారులు జుబేదా, బాలాజీనాయక్, అనందమూర్తి, రవిప్రభు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఎర్రచందనం పట్టివేత



తిరుమల,జనవరి 2(ఆంధ్రజ్యోతి): అత్యంత నిఘా కలిగిన తిరుమల నుంచి ఎర్రచందనం తరలిస్తున్న ఓ వ్యక్తిని ఫారెస్ట్ విభాగం గురువారం అదుపులోకి తీసుకుంది.ముందస్తు సమాచారంతో గురువారం సాయంత్రం ఫారెస్ట్ విభాగం అధికారులు, సిబ్బంది శిలాతోరణం చెక్‌పోస్ట్ వద్ద నిఘా పెట్టారు. సాయంత్రం 6 గంటల సమయంలో అడవి నుంచి శిలాతోరణం మార్గంలో వస్తున్న ఓ కారును తనిఖీ చేశారు. చిన్నపాటి ఎర్రచందనం దుంగలు కనిపించాయి. విజిలెన్స్ సిబ్బంది సహకారంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ సహా ఎర్రచందనాన్ని తిరుపతికి తరలించారు. పట్టుబడిన 20 ఎర్రచందనం దుంగలు (536 కిలోలు) సుమారు రూ.21లక్షలు ఉండొచ్చని అంచనా. కాగా, తిరుమల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా కొన్నేళ్లుగా తగ్గినట్టు అనిపించినా, ఇటీవల మళ్లీ మొదలైంది.

టీడీపీ కార్యదర్శిపై వైసీపీ దాడి



దాడిలో గాయపడ్డ పురుషోత్తం, రాజేష్‌లతో రోడ్డుపై ధర్నా

జాతీయ రహదారిపై బైఠాయించిన తెలుగు తమ్ముళ్లు

నగరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి):నగరి మండలం తడుకుపేట పంచాయతీలో గురువారం రాత్రి వైసీపీ శ్రేణులు జరిపిన దాడుల్లో టీడీపీ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడితో పాటు రాజేష్ అనే కార్యకర్త గాయపడడం ఉద్రిక్తతకు దారితీసింది.తడుకుపేట పంచాయతీ పరిధిలోని తడుకులో,ఎస్సీపురంలో ఉపాధి హామీ పథకం కింద సిమెంటు రోడ్లు మంజూరయ్యాయి. రోడ్డు పనులు చేపట్టేందుకు రాజేష్ చదును చేయించారు. గ్రావెల్‌కోసం మాట్లాడి వచ్చారు. ఈ విషయం తెలిసిన వైసీపీ నాయకులు రోడ్డెలా వేస్తారో చూస్తామంటూ రెండు రోజుల క్రితం రాజేష్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన పురుషోత్తం నాయుడు రాజేష్‌ను తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు.ఈ నేపథ్యంలో గురువారం వైసీపీకి చెందిన సత్యను పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించి సాయంత్రం పంపేశారు.గురువారం రాత్రి 8గంటల సమయంలో పురుషోత్తంనాయుడు, రాజేష్ నగరికి వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా వైసీపీ శ్రేణులు విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ విషయం తెలిసిన టీడీపీ శ్రేణులు గాయాలపాలైన పురుషోత్తం, రాజేష్‌లను తడుకుపేట వద్ద జాతీయ రహదారిపై పడుకోబెట్టి ధర్నాకు దిగారు. గంటన్నరకు పైగా వీరి ఆందోళన కొనసాగింది.నగరి,నింద్ర,విజయపురం మండలాలకు చెందిన పోలీసులు కూడా తడుకుపేటకు చేరుకున్నారు.10గంటలకు సీఐ మహేశ్వర్ ఆందోళనకారులతో చర్చించారు.నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు.గాయపడిన పురుషోత్తం, రాజేష్‌లను నగరి ఆస్పత్రికి తరలించారు.



తలపై గాయంతో రాజేష్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పురుషోత్తం

రెండు రైళ్ల రద్దు

తిరుపతి(ఆటోనగర్), జనవరి2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- జమ్ముతావి మధ్య నడుస్తున్న రైళ్ల(22705- 22706)ను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్తన్ రైల్వేలో జాతీయ రైలు మార్గం మరమ్మతుల కారణంగా ఈ నెల 7, 19 తేదీల్లో ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



కాలినడకన తిరుమలకు
నటి రాశి సింగ్

ప్రసన్న వదనం, భూతద్దం భాస్కర్ నారాయణ, ప్రేమ్‌కుమార్, పోస్టర్ వంటి చిత్రాల్లో నటించిన నటి రాశి సింగ్ గురువారం కాలినడకన తిరుమలకు వచ్చారు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా ఆమె సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో సినీ హాస్యనటులు

తిరుమల,జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం సినీ హాస్యనటులు సత్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం రాజేష్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం నటుడు శ్రీనివాస్‌రెడ్డి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల పొందేందుకు తిరుమలకు వచ్చామన్నారు. తర్వాత సత్యం రాజేష్ మాట్లాడుతూ తాను నటించిన రెండు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. 'పొలిమేర' నూతన చిత్రం షూటింగ్ రెండుమూడు నెలల్లో ప్రారంభంకానుందన్నారు. వీరికి చూడటానికి అభిమానులు పోటీపడ్డారు. వారితో సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.

సత్య, సత్యం రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి →



శ్రీవారి సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.13 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 69,630

తలనీలాలు సమర్పించినవారు : 18,965



ఆరోగ్యమే మహా భాగ్యమంటారు. ప్రస్తుత జీవన విధానంలో దీనికి మరింత ప్రాముఖ్యత పెరిగింది. ఆహారం నుంచి జీవనశైలి వరకూ అన్నీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వయసుతో సంబంధం లేకుంగా అనారోగ్యం బారినపడుతున్నారు. యుక్త వయసులో ఉన్నవారూ గుండెపోటుతో కుప్పకూలుతున్న వైనాలు చూస్తున్నాం. మధుమేహం,బీపీ సరేసరి. ప్రతినెలా ఆస్పత్రి లేదా మందుల షాపు చుట్టూ తిరుగుతున్నవారే అధికం. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయంలో జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యం దరిచేరదంటున్నారు వైద్య నిపుణులు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి





ఆరోగ్యమే ఆనందం

ఆరోగ్య పరీక్షలు ముఖ్యం

ప్రస్తుతం బీపీ, షుగర్ ఎక్కువ మందిలో కనిపిస్తున్న వ్యాధులు. వీటితోపాటు గుండె, మహిళలకు గైనిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మందిలో షుగర్ వ్యాధి లక్షణాలు కలవరపరుస్తున్నాయి. అందరూ ఆహారంపై శ్రద్ధ పెట్టాలి. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. క్రమం తప్పక ఆరు నెలలకు ఒకసారైనా డాక్టర్ దగ్గరకు వెళ్లి షుగర్, బీపీ, గుండె సంబంధిత సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. గర్భవతులు ప్రతీ నెలా తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వ్యాయామం చేయాలి. అనవసరపు ఒత్తిళ్లకు, ఆలోచనలకు దూరంగా ఉండాలి. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ కృష్ణప్రశాంతి, సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్



ఆహారంతోనే ఆరోగ్యం

ఆరోగ్యం ఆహారంలోనే ఉంటుంది. బయట ఆహారం, జంక్ ఫుడ్స్ తీసుకోవడం వలన వ్యాధుల బారిన పడుతున్నారు. అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ఉత్తమం. పచ్చదనంతో నిండిన కూరగాయాలు చక్కటి ఆరోగ్యాన్ని ఇస్తాయి. పిల్లలకు పానీపూరీలు, చాట్‌లు, బయట హోటళ్లలోని ఫుడ్ పెట్టకూడదు. రంగులు కలిపిన ఆహారాన్ని తినకూడదు. ఇంట్లో చేసిన ఆహారాన్ని మాత్రమే పెట్టడం మేలు. ఇంట్లో చేసుకునే పిండి వంటలు ఆరోగ్యానికి దోహదపడతాయి. మాంసాహారం తక్కువగా తీసుకోవాలి. పాలు, గుడ్లు, చేపలు వంటి వాటివి ఎక్కువగా తీసుకుంటే మంచిది.

- ప్రసాద్, డైటీషియన్, రుయాస్పత్రి





అనారోగ్యానికి యోగాతో చెక్

రోజూ యోగా చేస్తే సాధారణ, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడరు. యోగాతోపాటు సులువుగా జీర్ణమయ్యే మిత ఆహారాన్ని, ఎక్కువ శాతం నీటిని తీసుకోవాలి. చిన్నవయసు నుంచే యోగాను అలవాటు చేయడం వలన ఆరోగ్యంగా ఎదుగుతారు. దేవాలయాలకు వెళ్తే అక్కడ మనం చేసే స్వామి వారికి నమస్కారం నుంచి ప్రదక్షిణల వరకు ప్రతీది యోగాలో భాగమే.

- డాక్టర్ నానబాల జగదేక ప్రతాప్, యోగా నిపుణుడు

పందెం కోళ్లను బరిలోకి దింపేందుకు సై అంటున్నారు కొందరు. మరో పది రోజుల్లో పండుగలు మొదలు కానుండటంతో.. ఇప్పటికే చాలావరకు కోళ్లను జిల్లాకు తీసుకొచ్చారు. వీటికి పౌష్టికాహారం అందిస్తున్నారు. కోళ్ల పందేలపై నిషేధమున్నా.. పోలీసులు హెచ్చరికలు చేస్తున్నా.. ఎక్కడికక్కడ గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించేందుకు బరులు సిద్ధమవుతున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



పందేనికి సై

కోళ్ల రకం, రంగును బట్టి రూ.2 లక్షల వరకు పలుకుతున్న ధర

సంక్రాంతి సీజన్‌తో పెరిగిన డిమాండ్

సంక్రాంతికి పట్టణాలు, పల్లెలు సిద్ధమవుతున్నాయి. చాటుమాటుగా కోడి పందేల నిర్వహణకూ పలువురు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పలు రకాల కోళ్లకు డిమాండు పెరిగింది. పందేలకు అవసరమైన కోడి పుంజులకు మూడు నెలల నుంచి తమిళనాడు, పలమనేరు, ఊత్తుకోట, చెన్నై, ఏకాంబరకుప్పం, నారాయణవనం వంటి ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు కూడా. కోడి పందేలు ఎక్కడా నిర్వహించకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా.. చాలాచోట్ల నిర్వాహకులు మాత్రం బరులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లాకు దాదాపు 20 వేల వరకు పందెం కోళ్ల కోళ్ల తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. కోళ్ల జాతి రకం, రంగును బట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ధర పలుకుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే తీసుకొచ్చిన ఈ కోళ్లను కొందరు అతిజాగ్రత్తగా చూసుకొంటున్నారు. కోళ్లకు పెరిగిన డిమాండు నేపథ్యంలో కొందరు వీటిని తీసుకొచ్చి విక్రయించడం పనిగా పెట్టుకున్నారు. దీనికి సోషల్ మీడియాను వాడుకుంటున్నట్లు తెలిసింది. తమ వద్దనున్న పందెం కోళ్ల వివరాలను కొందరు ఫేస్‌బుక్, వాట్సాప్‌లో పెట్టి వాటి వయస్సు, ఎన్ని పందేలు గెలిచిందనే వివరాలను అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నారు. ఈ విధంగా విక్రయించిన వాటిని పార్శిల్ చేయడానికి కూడా ఒక రేటు ఫిక్స్ చేసి బస్సులు, ఆటోలు, వ్యాన్లలో పంపిస్తున్నారు. అక్కడి వారు ఫోన్ ద్వారా సంప్రదించి ఎక్కడకు ఏ సమయానికి కోళ్లు చేరుకుంటాయనేది తెలుసుకుని రిసీవ్ చేసుకుంటున్నారు. ఇలా మొత్తం వ్యవహారం ఆన్‌లైన్ ద్వారానే సాగిపోతోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి.

డిమాండున్న కోళ్లు

పందెం కోళ్లలో అత్యధికంగా కోడి నెమలి, అబ్రాస్, రసంగి, ఎర్ర డేగ, కక్కెర వంటి రకాలకు మంచి డిమాండ్ ఉంది. సైజు, రంగు, జాతిని బట్టి వీటిని దాదాపు రూ.2 లక్షల వరకు విక్రయిస్తున్నారు.

ఆఫర్లతో ఆకర్షణ

కోడి పందేల్లో ఇటీవల ఆఫర్లూ ప్రకటిస్తున్నారు. వరుసగా ఐదు పందేలు నెగ్గితే ద్విచక్ర వాహనం ఇస్తున్నారు. గత ఏడాది వరుసగా పందెం కొట్టి వాహనాలు గెలుచుకున్న వారు ఉన్నారని సమాచారం. ఫలితంగా నిర్వాహకుల మధ్య గట్టి పోటీ ఏర్పడింది.

నాదనీరాజనం కార్యక్రమాల వేళల మార్పు



నాదనీరాజనం వేదికపై మీనాక్షి సోమసుందరం బృందం వీణవాయిద్య కచేరి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సంగీత, నృత్య కార్యక్రమాల సమయాన్ని టీటీడీ మార్చింది. గతంలో ఈవేదికపై కార్యక్రమాలన్నీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు జరిగేవి. పారాయణాల పేరుతో వీటిని మధ్యాహ్నం 3.10 నుంచి 4.30 గంటలకు మార్చారు. ఈ సమయం కళాకారులకు ఇబ్బందిగా మారడంతో పాటు భక్తులెవ్వరు ఉండటంలేదరు. ఫలితంగా ప్రోత్సాహం కరువైంది. ఈ విషయాలను ఇటీవల 'కళతప్పిన నాదనీరాజనం' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి పాత విధానంలో సాయంత్రం 6 నుంచి 7 గంటలకు కార్యక్రమాల నిర్వహణను మార్చారు. గురువారం సాయంత్రం తమిళనాడుకు చెందిన మీనాక్షి సోమసుందరం బృందం నాదనీరాజనం వేదికపై వీణ వాయిద్య కచేరి భక్తులను ఆకట్టుకుంది.

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

కేజీబీవీ ట్రైనర్లకు శిక్షణ ప్రారంభం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'టీచింగ్ అనేది వృత్తి కాదని, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకత్వం చేసే బాధ్యత' అని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం విజయవాడలోని లయోలా కాలేజీలో ఆయన ప్రారంభించారు. కేజీబీవీ టీచర్లు బాలికల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని, బాలికలకు భద్రత, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ శిక్షణా సదస్సు నుంచి మెరుగైన బోధనా విధానాలు నేర్చుకుని, కేజీబీవీల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఆపస్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల అంశాలను ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా.. ఇంతవరకు రూ.25 వేల కోట్ల బకాయిలు, ఐఆర్, డీఏ, 12వ పీఆర్ అంశాలపై సానుకూల ప్రకటనలు లేవన్నారు. ప్రతి నెలా రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నా.. ఉద్యోగుల అంశాలపై చర్చ జరగట్లేదన్నారు. సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

షార్ ఎంఎస్ఏ డీడీగా గోపీకృష్ణ

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏరియా (ఎంఎస్ఏ) డీడీగా గోపీకృష్ణ నియమితులయ్యారు. ఎంఎస్ఏ గ్రూపు డైరెక్టర్ ఉన్న ఈయన్ను పదోన్నతిపై డీడీగా నియమించారు. అదేవిధంగా షార్‌లో సాలిడ్ మోటారు ప్రిపరేషన్, ఎన్విరాన్‌మెంటల్ టెస్టింగ్ ఫెసిలిటీ (ఎస్ఎంటీఈటీఎఫ్) డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ శంకరన్‌ను వాల్ప్ (వీఏఎల్ఎఫ్) డీడీగా నియమించారు. ఈ మేరకు బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిసింది. వీరు మరో నాలుగు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

నేదురుమల్లి సహా వైసీపీ నేతలపై కేసు నమోదు

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, జనవరి 2: (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో గత నెల 27వ తేదీన వైసీపీ నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో తనపై కొంతమంది ఆ పార్టీ నాయకులు దౌర్జన్యం చేశారంటూ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సీసీ నాయుడు గత నెల 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెంకటగిరి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డితో పాటు ఆ పార్టీకి చెందిన అల్లం సాయి, అల్లం సుబ్బు, ఏవీ నాగార్జున, నర్రావుల వేణుగోపాల్ నాయుడు, చింతల శ్రీనివాసులు రెడ్డి, ముప్పాళ్ల మునికృష్ణ, ఎం.శ్రీనివాసులు, మస్తాన్ రెడ్డి, నాగేంద్ర, కోమల వెంకటయ్య, బత్తల సాయిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, తమపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ కేసులపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

● 1200 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు పూర్తి

నేడు నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా



జాబ్ మేళాలో అభ్యర్థుల కోసం కుర్చీల ఏర్పాటు

చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందులో 1200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఆన్‌లైన్ ద్వారా 1800 మంది దరఖాస్తు చేసుకొన్నట్లు అధికారులు తెలిపారు. ఆఫ్‌లైన్ ద్వారా కూడా నిరుద్యోగులు వచ్చే అవకాశాలు ఉందన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో జాబ్‌మేళా జరుగుతుంది. ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో డీపీవో సుశీలాదేవి పర్యవేక్షణలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం ఏర్పాట్లు చేశారు. 20 కౌంటర్లలో అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. విజయవాడ, హైదరాబాదు, చెన్నై, బెంగళూరులకు చెందిన ఐటీ, బీపీవో కంపెనీలు, శ్రీసిటీ, గాజులమడ్యం, రేణిగుంట ఈఎంసీ, నాయుడుపేట ఎస్ఈజడ్ నుంచి పరిశ్రమల మొత్తం 20 కంపెనీల ప్రతినిధులు రానున్నారు. మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. అనుకున్న లక్ష్యాన్ని దాటి అదనంగా 500 మందిని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు వారు చెప్పారు.

మద్యం తాగి తిరుమలకు వచ్చిన
ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్



తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలకు మద్యం సేవించిన వచ్చిన ఇద్దరు డ్రైవర్లను ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్ చేశారు. న్యూయర్ సందర్భంగా ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, సిబ్బంది బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అతివేగంగా వస్తున్న రెండు వాహనాలను నిలిపి డ్రైవర్లు శేఖర్, శంకర్‌ను బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీ చేశారు. వారు మద్యం తాగి వచ్చినట్టు నిర్ధారణ అయింది. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహనాలను తిరుమలకు శాశ్వతంగా రాకుండా సీజ్ చేశారు. మద్యం తాగి తిరుమలకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళం అందింది. తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ కుమార్ ఈ విరాళాన్ని అందజేశారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి చెక్‌ను అందజేసి ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

← కుటుంబ సభ్యులతో విరాళాన్ని అందజేస్తున్న గిరిధర్

గో ఆధార్ మజల్స్ యాప్ ప్రారంభం



చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో గురువారం 'గో ఆధార్ మజల్స్' యాప్‌ను జిల్లా పశుసంవర్ధనశాఖాధికారి డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా మజుల్స్‌ను క్యాప్చర్ చేసి, అందులో పశువుల యజమాని పేరు, ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్లను నమోదు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాడి రైతులు తమ పశువులను సులభంగా గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీడీ డాక్టర్ ఉమామహేశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 329 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు గురువారం 329 అర్జీలు అందాయి. 49 గ్రామసభల్లో వచ్చిన ఈ అర్జీల్లో ఇంటి స్థలాలపై 19, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 8, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 5, క్యాస్ట్ వెరిఫికేషన్ 2, రీసర్వే 29, ల్యాండ్ గ్రాబింగ్ 1, ఆర్‌వోఆర్‌పై 158, ఇతర విషయాలకు సంబంధించి 99 ఉన్నాయి. అందులో 155 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన వాటిని నిర్ణీత కాల పరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న పరిశీలకులు కృష్ణయ్య

కోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీలు ప్రభుత్వ నిధులతో ఆయా పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పరిశీలకులు, చిట్టమూరు ఎంఈవో కృష్ణయ్య కోరారు. కోట జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీలకు రెండు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 40 పాఠశాలల యాజమాన్య కమిటీలకు కృష్ణయ్యతోపాటు స్థానిక ఎంఈవో మస్తానయ్య, పలువురు రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కొన్ని ప్రణాళికలతో ముందుకు వస్తుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆయా నిధుల వినియోగంతోపాటు విద్యాప్రమాణాల మెరుగులో కీలకప్రాత పోషించాలన్నారు.

కొండేపాటిని కలిసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


గంగాప్రసాద్‌కి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌ను గురువారం కడప జిల్లా ఎమ్మెల్సీ పుత్తా నరసింహా రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డిలు ఆయన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండేపాటికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కొండేపాటి కూడా వారిని శాలువా కప్పి సత్కరించారు.

దరఖాస్తు చేసుకొన్న 16 రోజులకే వితంతు పింఛన్లు


పింఛన్లు అందజేస్తున్న శంకరయ్య, తిరుపాల్, వెంకటేశ్వర్లు తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకొన్న రెండు వారాలకే వితంతు పింఛన్లు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య తెలిపారు. గురువారం కడపత్ర సచివాలయంలో మండల పరిధిలోని దామరాయి గ్రామానికి చెందిన సత్యవేటి రమణమ్మ, గోపిశెట్టి సరస్వతి, అత్తిరాల చిలకమ్మలకు కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు ముగ్గురూ వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా రెండు వారాలకే మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరుణ్, టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ గొంజి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తిరుపాల్, జానకిరామయ్య, అక్కులయ్య, వరాలు, వెంకటేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి


ప్రకాష్ నాయుడిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని ఆ పార్టీ గూడూరు రూరల్ మండల అధ్యక్షుడిగా ఎంపికైన గాలి ప్రకాష్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని పోటుపాళెం సమీపంలో గూడూరు రూరల్ బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ తనను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్ఠతకు క్రియాశీలకంగా వ్యవహరిస్తానన్నారు. కార్యక్రమంలో భైరప్ప, సురేంద్రనాథ రెడ్డి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో ఫైనల్స్‌కు చేరిన శ్రీచైతన్య, ఎల్‌ఏపీ పాఠశాలల జట్లు


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

గూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీక్లబ్, గూడూరు క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్‌పాఠశాలల క్రికెట్ పోటీల్లో గురువారం శ్రీచైతన్య, ఎల్‌ఏపీ పాఠశాలల జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నారు. శ్రీచైతన్య-ప్రాస్పరో జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్స్‌లో శ్రీచైతన్య జట్టు గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో సెమీఫైనల్స్ ఎల్ఏపీ-గూడూరు జడ్పీ పాఠశాలల మధ్య జరగగా ఎల్‌ఏపీ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. శుక్రవారం ఈ రెండు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు నిర్వాహకులు మునిగిరీష్, లవకుమార్ తెలిపారు.

యాదవ సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట యాదవ సంక్షేమ సంఘ నూతన క్యాలెండర్‌ను గురువారం టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు మొలకల రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యాదవ సంఘానికి చెందిన ముచ్చకాల రమణయ్య, ఎం.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, పి.శివరామకృష్ణ, ఎం.ప్రసాద్, టి.మోహన్, వి.దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు వినియోగించుకోండి

వెంకటగిరిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని డీఈ కలైమణి తెలిపారు. 3జీ సిమ్‌లను 4జీ సిమ్‌లకు మార్చేందుకు శని, మంగళవారం బాలాయపల్లిలో, బుధవారం, గురువారం నిడిగల్లులో సిమ్ మేళా నిర్వహిస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాభాలు, హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

కోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోటలో గురువారం ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు జరిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్‌సేఫ్టీ అధికారిణి నర్మదలు పలు మార్టులు, హోటళ్లు, దాబాలలో ఉన్న వంటకాలు, ఫలహారాలను పరిశీలించారు. కొన్ని శాంపిళ్లను వెంట తీసుకెళ్లారు. ఈ బృందం వెంట స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధులత ఉన్నారు.

అత్యాచారయత్నం ఘటనలో నిందితుడి అరెస్టు

తడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. తడ మండలానికి చెందిన 57 ఏళ్ల దివ్యాంగ వృద్ధురాలిపై తడకండ్రిగ గ్రామానికి చెందిన మొలవాయిల్ కుమార్ గత మంగళవారం అత్యాచారయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. దానిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గురువారం తడలో అరెస్టు చేశారు. నిందితుడిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

చిట్టమూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి గ్రామానికి చెందిన హేమ ఇంటిలో బుధవారం చోరీ జరిగినట్లు చిట్టమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కనుపూరుకు దైవదర్శనానికి వెళ్లిన హేమ కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళాలు తీసేసి ఉన్నట్లు గమనించారు. ఇంట్లోకెళ్లి పరిశీలించగా 5 సవర్ల బంగారం కన్పించలేదని బాధితులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పోలీస్ స్టేషన్‌లో గురువారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు రికార్డులను తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, ఆహార పొట్లాల పంపిణీ


దుస్తులు, ఆహార పొట్లాలు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు


గూడూరు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో గురువారం సేవాసంస్థ ఆధ్వర్యంలో భాస్కరరావు సహకారంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జి.చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళీ నాయుడు, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న ఎంఈవో జగదీష్ బాబు, హెచ్ఎం నాగరాజు

డక్కిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, రిసోర్సుపర్సన్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాకమిటీ ఛైర్మన్, సభ్యులతో కలసి పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం నాగరాజు, తగ్గవోలు హెచ్ఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కిశోరి బాలికలపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న సీహెచ్‌వో సుబ్బరామయ్య

ఓజిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికల వికాసం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి చేరువచేయాలని ఓజిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో సుబ్బరామయ్య అన్నారు. ఓజిలిలోని స్త్రీ శక్తి భవనంలో గురువారం కిశోరి వికాసంపై అంగన్‌వాడీ టీచర్స్ ఏఎన్ఎం, మహిళా పోలీసు, మహిళా సంక్షేమ కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 11-18 వయస్సు ఉన్న కిశోరి బాలికలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం గ్రామాల్లో కమిటీల ఏర్పాటుతోపాటు వారికి అవగాహన కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బాల్య వివాహాలు, రక్తహీనత, ఋతుక్రమ పరిశుభ్రతతోపాటు బాలల వేధింపులు, బాలల అక్రమరవాణా వంటి వాటిపై ఎప్పటికప్పుడు దృష్టిపెట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో ఉమామహేశ్వరి, ఎంపీడీఓ విజయలక్ష్మి పలు విషయాలపై శిక్షణలో అవగాహన కల్పించారు.

గూడూరును కమ్మేసిన పొగమంచు


వివేకానందరోడ్డులో, రైల్వేస్టేషన్‌లో కమ్మేసిన పొగమంచు

గూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణాన్ని గురువారం ఉదయం పొగమంచు కమ్మేసింది. స్థానిక రైల్వేస్టేషన్, వివేకానందరోడ్డు, ఆసుపత్రిరోడ్డు, స్టేడియం, జాతీయ రహదారి, పొలాలు తదితర ప్రాంతాల్లో పొగమంచు కురిసింది. దీంతో వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పొగమంచు ఆహ్లాదకరంగా ఉండటంతో ప్రజలు ఆస్వాదించారు.

శిథిలావస్థకు చేరిన బ్రిటీష్ కాలంనాటి వంతెన

- కాళంగి నదిపై ప్రమాదకరంగా ప్రయాణం
- 20 ఏళ్లుగా ప్రతిపాదనలతోనే సరి...


శిథిలావస్థకు చేరిన కాళంగి వంతెన

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రధాన రహదారి జీఎన్‌టీ రోడ్డులో చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 2004 నుంచి పలుసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. వంతెన కింద భాగం అక్కడక్కడ పగుళ్లు వచ్చాయి. ఈ రోడ్డు సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో వేలాది వాహనాలు వెళ్తున్నాయి. దీనికి తోడు సూళ్లూరుపేట పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ఇక్కడ నుంచి శ్రీసిటీ, అపాచి, మేనకూరు ప్రాంతాలకు వందలాది వాహనాలు వెళ్తున్నాయి. దీంతో భారీ వాహనాలు కూడా వంతెనపై నుంచి వెళుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. డిసెంబరులో వచ్చిన వరుస తుఫాన్‌లకు వంతెన కింద గుండా వెళ్లే నీటి పారుదలకు మరింత బలహీనపడింది. ఈ వంతెన స్థానంలో మరో వంతెన నిర్మించాలని 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం రూ.3 కోట్లు నిధులు మంజూరైనట్లు ప్రకటించారే తప్ప ఆచరణకు నోచుకోలేదు. 2017లో ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపినా కదలికలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టించుకోకుండా 2023 నవంబరులో అప్పటి సీఎం జగన్ తడ మండల పర్యటన నేపథ్యంలో రూ.35 కోట్లతో కాళంగి నది వంతెన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా సీఎం పర్యటన రద్దుయ్యింది. మళ్లీ కాళంగి వంతెన కథ మొదటికి వచ్చింది. ఇటీవల వర్షాల సమయంలో వంతెన బాగా బలహీనపడటంతో పోలీసులు భారీ వాహనాలు, కంపెనీలకు వెళ్లే బస్సులు వంతెనపై వెళ్లకుండా ఆదేశాలు జారీ చేశారు. కాని కంపెనీలకు వెళ్లే బస్సులు, భారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. 2007లో ఈ వంతెన ఓ వైపు కూలి ప్రమాదస్థాయికి చేరడంతో దాదాపు ఆరు నెలల పాటు రాకపోకలు నిలిపివేశారు. అనంతరం తాత్కాలికంగా మరమ్మతులుచేసి వాహన రాకపోకలు పునఃప్రారంభించారు. ప్రధాన రహదారిపై కాళంగి వంతెన శిథిలావస్థకు చేరినా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కాళంగి వంతెనపై వెళ్తున్న వాహనాలు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్


క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన శారీరక దారుఢ్యం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో మెలగాలని చెప్పారు. విద్యార్థినులు కూడా ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలోని మైనింగ్ విభాగం దేశస్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రవికృష్ణ, విజయ్‌కుమార్, నిర్మల్‌కుమార్, వెంకటేశ్వర్లు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, వెంకటేష్, ఇశ్రాయిల్‌కుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం

- గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా


చిట్టమూరులో మాట్లాడుతున్న రాఘవేంద్ర మీనా

చిట్టమూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రెవెన్యూ సదస్సుల వలన భూసమస్యలకు శాశ్విత పరిష్కారం లభిస్తుందని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. గురువారం చిట్టమూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వరకు చిట్టమూరు మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన అర్జీలకు అధికారులు వేగంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, తహసీల్దార్ విజయలక్ష్మి, ప్రత్యేకాధికారి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, రీసర్వే డీటీ నిరంజన్‌కుమార్, హౌసింగ్ ఏఇ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు గ్రామం ఉత్తర పొలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. రైతుల నుంచి వినతులను తీసుకున్న వెంటనే సంబంధిత రికార్డులను తనిఖీ చేసి వీలైనంత త్వరగా పరిష్కరించాలని తహసీల్దారు రామయ్యకు సూచించారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఆర్ఐ అఖిల్‌యాదవ్, వీఆర్వో హరిబాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్, టీడీపీ నాయకులు కుంచం దయాకర్, షేక్ గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి (ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని సంగనపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, మండల సర్వేయర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఓజిలి (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పినపరియపాడు, రాఘవరెడ్డిపాళెం గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దారు మధుసూదనరాజు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో రైతులు భూసమస్యలపై అర్జీలు అందచేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

కోట (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ లక్ష్మక్కకండ్రిగలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పలువురు రైతులు భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని సమస్యలను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి రియాజ్‌ఉద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు వినతులు అందజేస్తే అధికారులు సత్వరమే పరిష్కరిస్తారని తెలిపారు. స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద నాయుడు, మాడుపూరు మురళీ నాయుడు, వీఆర్వో రమేష్, మండల సర్వేయర్ పూజిత, మాజీ సర్పంచు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అవినీతిపై విచారణ ఏది?

- నిలదీసిన రాజకీయ పక్షాలు
- గందరగోళంగా గ్రామసభ


సర్పంచ్‌ను నిలదీస్తున్న రాజకీయ పక్షాలు, గ్రామస్థులు

రేణిగుంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారణలో జరుగుతున్న జాప్యంపై రాజకీయ పక్షాల నాయకులు నిలదీశారు. అభివృద్ధి చేయకనే చేసినట్లు చూపి నిధులు స్వాహా చేసినా ఎందుకు ఉపేక్షిస్తున్నారనంటూ జనసేన, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు ధ్వజమెత్తారు. ఆ మేరకు సర్పంచ్ నాగేశం, కార్యదర్శి మణిని నిలదీయడంతో రేణిగుంట పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన గ్రామసభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి లక్షల్లో బిల్లులు పెట్టుకుని స్వాహా చేసిన వైనంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. సుబ్బరాజు బోరు స్థలం విషయంలో న్యాయస్థానానికి వెళ్లేందుకు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో చెప్పాలని పట్టుబట్టారు. పంచాయతీకి చెందిన బస్టాండు దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంతలో అధిక మొత్తంలో వసూలు చేయడాన్ని తప్పుబట్టారు. పంచాయతీలో వేలంపాట నిర్వహించకపోవడాన్ని ప్రశ్నించారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో రోడ్లు మొత్తం గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్రఇబ్బందికరంగా మారినా పట్టించుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. గ్రామసభలో లేవనెత్తిన సమస్యలను రికార్డు బుక్‌లో నమోదు చేసి గ్రామస్థుల చేత సంతకాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మణి మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవినీతిపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపడుతామని తెలిపారు. తాను కొత్తగా ఇక్కడ బాధ్యతలు చేపట్టానని, గత విషయాలు తనకు తెలియవని, ఉన్నతాధికారులదృష్టికి సమస్యను తీసుకెళతానని చెప్పారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఇద్దరు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్

- మూడు దుంగల స్వాధీనం

మంగళం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు సమీపంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ టి.విష్ణువర్ధన్ బృందం బుధవారం అర్ధరాత్రి చంద్రగిరి మండలం భాకరాపేట రేంజ్‌లోని నాగపట్ల బీట్ పరిధిలో కూంబింగ్ నిర్వహించింది. శ్రీవారిమెట్టు సమీపంలో ముగ్గురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ పోలీసుల కంటపడ్డారు. చుట్టుముట్టే ప్రయత్నం చేయగా దుంగలను పడేసి పారిపోయే ప్రయత్నం చేశారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఒకరు తప్పించుకున్నారు. పడేసిన మూడు దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మరికొందరు స్మగ్లర్లు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.


స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు